ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 12 జూన్ 2025 | 3

ఏడాది.. ఏమైంది..



కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది

నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టిన జిల్లా ఎమ్మెల్యేలు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో బీజేపీ మద్దతుతో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి గురువారంతో ఏడాది పాలన పూర్తి చేసుకుంది. నాటి సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించి అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు సాగిన పాలన తీరును ప్రజలు నిశితంగానే పరిశీలిస్తున్నారు. వైసీపీ పాలనకు, కూటమి పాలనకు మధ్య స్పష్టమైన మార్పులనూ గమనిస్తున్నారు. ఈ ఏడాదిలో ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరును సైతం జనం బేరీజు వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో ఎమ్మెల్యేలు ఇచ్చిన ప్రధాన హామీలేంటి.. వాటి ప్రస్తుత పరిస్థితి ఏంటి, ప్రతిపాదనలు చేసిన పనులు, మంజూరైన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు చేరువయ్యేందుకు వారు ఏం చేస్తున్నారనే విషయాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

6

నేటి నుంచి బడులు పునః ప్రారంభం



రాజమహేంద్రవరం, జూన్11(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిశాయి. 2025-26 విద్యా సంవత్సరం గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈమేరకు బడులు సిద్ధమయ్యాయి. పాఠశాలల తెరిచిన నాటి నుంచే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను అందజేయనున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అందజేసిన వాటికంటే నాణ్యమైన మెటీరియల్‌ని అంతకంటే తక్కువ ధరకే కొనుగోలు చేసిన ప్రభుత్వం.. పాఠశాలలకు పంపించింది. కిట్‌లో బ్యాగ్, బెల్ట్, నోట్‌బుక్స్ షూస్, యూనిఫాం, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, టెక్స్ బుక్స్, వర్క్ బుక్స్ ఉంటాయి. జిల్లాలోని 984 ప్రభుత్వ పాఠశాలల్లో 49,583 మంది విద్యార్థినులు, 44,771 విద్యార్థులు కలిపి మొత్తం 94,354 కిట్లు అందించనున్నారు. ఇప్పటికే బ్యాగులు 71%, బెల్టులు, నోట్‌బుక్స్, టెక్స్ బుక్స్, డిక్షనరీలు, వర్క్‌బుక్స్ వంద శాతం, షూలు 68%, యూనిఫామ్స్ 54% ఆయా పాఠశాలలు చేరాయి. మిగతా వాటిని కూడా రెండు మూడు రోజుల్లో పంపించనున్నారు. మొత్తంగా జిల్లాలో 94354 బ్యాగులు, 61548 బెల్టులు, 662952 నోటు పుస్తకాలు, 94548 షూలు, 84354 జతల యూనిఫామ్స్, 9228 డిక్షనరీలు, 414529 టెక్టు పుస్తకాలు, 76662 వర్కు పుస్తకాలను విద్యార్థులకు అందజేయనున్నారు. అయితే బెల్టులు, షూలు, యూనిఫామ్, బ్యాగులను స్కూల్స్‌లో గత ఏడాది మాదిరి పేరెంట్స్ మీటింగులను వేడుకగా నిర్వహించి అందజేయాలని ఆలోచన చేస్తున్నారు. ఈ నెల 20న పేరెంట్స్ మీటింగ్ నిర్వహించే అవకాశం ఉందని చెబుతున్నారు.

మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం : కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనానికి (ఎండీఎం) ఇకపై ఫోర్టిఫైడ్ సన్న బియ్యం వినియోగించనున్నారని, ఈ మేరకు ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు కూడా వాటినే పంపించామన్నారు. జిల్లాలోని మొత్తం 804 పాఠశాలలు, 70 సంక్షేమ వసతి గృహాలకు 25కిలోల బరువున్న 11,150 బస్తాలను ఇప్పటికే పంపించామన్నారు. ప్రతి బస్తాపైనా ఉన్న క్యూఆర్ కోడ్‌ని సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్కాన్ చేయాలన్నారు. కాగా నూతన విద్యాసంవత్సరంలో పాఠశాలలు ప్రారంభించిన రోజే డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకంలో సన్నబియ్యం (ఫైన్‌రైస్) వినియోగించడం జరుగుతుందని జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కే వాసుదేవరావు తెలిపారు.

ఆర్టీసీ అధికారుల బదిలీలు

రాజమహేంద్రవరంఅర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పెద్దఎత్తున బదిలీలు జరిగాయి. డిపో మేనేజర్ కేడర్‌లో ఈ బదిలీలు చేపట్టారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న షేక్ షబ్నం ఏలూరు జిల్లా ఆర్టీసీ అధికారిణి (డీపీటీఓ)గా బదిలీ చేశారు. ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి డీపీటీఓగా ఆమె బాధ్యతలు చేపడతారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్‌గా ఇక్కడి కార్గో విభాగంలో ఏటీఎం (కమర్షియల్)గా పనిచేస్తున్న కె.మాధవ్‌ను నియమించారు. అలాగే కొవ్వూరు డిపోమేనేజర్‌గా ఉన్న వైవీవీఎన్ కుమార్‌ను రావులపాలెం డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. కొవ్వూరు డీఎంగా ఎవరినీ నియమించలేదు. రాజమహేంద్రవరం కార్గో మేనేజర్ మాధవ్ స్థానంలో తుని డిపో మేనేజర్ ఎన్.కిరణ్ కుమార్ బదిలీపై రానున్నారు. మంగళవారం రాత్రి ఆర్టీసీ ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు ఉత్తర్వులు అందాయి.

జిల్లాలో 1368 పనులకు శ్రీకారం : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో రూ.3430 కోట్ల 77 లక్షలతో చేపట్టిన 1368 పనులకు బుధవారం శంకుస్థాపనలు జరిగాయని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఆయా ప్రారంభోత్సవాల్లో జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఈ శంకుస్థాపనలు చేశారని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం
12 జూన్ 2025

కౌన్సెలింగ్

పసికందులకు ఎలాంటి ఘనాహారం?

డాక్టర్! మా బాబుకు ఐదో నెల. ఆరో నెల నుంచి ఘనాహారం మొదలుపెట్టాలని అనుకుంటున్నాం. బిడ్డకు ఏడాది వయసొచ్చేవరకూ ఎలాంటి ఆహారం అందించాలో వివరించగలరు? - ఓ సోదరి, హైదరాబాద్

ఆరో నెల నుంచి సాధారణంగా అన్నంలో పప్పు, నెయ్యి కలిపి తినిపించడం మొదలు పెడతాం! కానీ వీటి ద్వారా బిడ్డకు అందే పోషకాలు అతి స్వల్పం. కాబట్టి...

- పప్పుధాన్యాలు, అన్ని రకాల కూరగాయలు, పులుపు లేని పళ్లు తినిపించాలి. రుచి కోసం చాలా పరిమితంగా నెయ్యి వాడొచ్చు. లేదంటే ఏదైనా వెజిటబుల్ ఆయిల్ అయినా అన్నంలో కలిపి పెట్టొచ్చు.
- ఉప్పు, తీపి... ఈ రెండూ రుచిని పెంచే మాట నిజమే అయినా, పసికందులకు వీటిని అలవాటు చేయకూడదు. వీటికి బదులుగా రుచి కోసం పసుపు, దాల్చిన చెక్క, యాలకులు, సోంపు, అల్లం, వెల్లుల్లి పేస్ట్, జీలకర్ర, ధనియాల పొడులను వంటకాల్లో కలిపి తినిపిస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- తీపి పెట్టాలనుకుంటే తగు మాత్రంగా బెల్లం వాడొచ్చు. నీళ్లు తాగడానికి ఇష్టపడకపోతే బెల్లం లేదా పళ్ల ముక్కలు వేసి తాగించవచ్చు.
- తొమ్మిదో నెల నుంచి గుడ్డు పచ్చసొన తినిపించవచ్చు.
- ఉడికించే ఆహారం మెత్తగా ఉండాలి.
- ప్రతి పూటా అన్నమే తినిపించాలని లేదు. అన్నం బదులు కూరగాయ ముక్కలను తగుపాళ్లలో మసాలాలు జోడించి తినిపించవచ్చు. ఉడికించి, చిదిమిన పళ్ల ముక్కలు తినిపించవచ్చు.



- పెద్దలతో సమానంగా పిల్లలూ మూడు పూటలు తినాలి అనుకుంటే పొరపాటు. ఒకేసారి ఎక్కువ పరిమాణాల్లో పిల్లలు తినలేకపోతే, అదే పరిమాణాన్ని 6 భాగాలుగా వేర్వేరు సమయాల్లో తినిపించవచ్చు.
- సెరెలాక్ లాంటి ప్రత్యామ్నాయ మిల్క్ ఫుడ్స్, ప్రయాణాల్లో, ఇంటి భోజనం వండలేని సమయాల్లో మాత్రమే ఇవ్వాలి. దీన్లో చక్కెర కలపకూడదు.

ఇవి కూడదు...

పిల్లలకు తినిపించకూడని పదార్థాలు కూడా ఉన్నాయి. అవేంటంటే...

- అలర్జీ తలెత్తకుండా ఉండడం కోసం కొత్తగా ఏ రెండు కొత్త పదార్థాలను కలిపి తినిపించకూడదు. ఒకదాని తర్వాత మరొకటిగానే రుచి అలవాటు చేయాలి.
- ఈ వయసు పిల్లలకు నట్స్ నుంచి అలర్జీ లాంటి ఇబ్బందులు తలెత్తవచ్చు. కాబట్టి వేరుశనగ, బాదం, జీడిపప్పు లాంటివి పొడి రూపంలో కూడా తినిపించకూడదు.
- సంవత్సరం లోపు పిల్లలకు తేనె, ఉప్పు, చక్కెర తినిపించకపోవడమే మంచిది. తీయదనం కోసం బెల్లం వాడొచ్చు.
- బాస్మతి లాంటి పాలిష్ పట్టిన బియ్యం వాడకూడదు.
- ఐస్‌క్రీమ్‌లు, బిస్కెట్లు, చాక్లెట్లు, శీతల పానీయాలు, కొబ్బరి నీళ్లు ఇవ్వకూడదు. **- డాక్టర్ సుమతి,** పిడియాట్రిషియన్, హైదరాబాద్

అభిరుచి



అలనాటి అరుదైన నటి సూర్యకాంతం.
పాత్ర ఏదైనా పరకాయ ప్రవేశం చేసి...
మరెవరికీ సాధ్యంకాదన్న రీతిలో అభినయించి...
తెలుగు తెరపై తనదైన ముద్ర వేశారు.
ఇది దశాబ్దాల కిందటి కథ.
మళ్లీ ఇప్పుడు ఆ నట విన్యాసాన్ని
అనుకరించి... సూర్యకాంతాన్ని మరిపించి...
తెలుగు ప్రేక్షకులను మురిపిస్తోంది...
మంజూష ముక్కవిల్లి. వెండితెరపై నాటి
అపురూప సన్నివేశాలను
ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌లో పండించి...
టాలీవుడ్ తారల ప్రశంసలు సైతం అందుకున్న
మంజూషతో 'నవ్య' ముచ్చట్లు.

అచ్చం సూర్యకాంతంలా!

"ఒక అభిరుచి... చిన్నప్పుడే నాలో బలంగా నాటుకుపోయింది. అది మరేదో కాదు... నటించాలన్న తపన. నాకు తెలియకుండానే నాలోని నటుణ్ణి బయటకు తీసే ప్రయత్నం ఎప్పటికప్పుడూ చేస్తూనే ఉన్నాను. బడికి వెళ్లే రోజుల్లో... కాలేజీలో చదివే సమయంలో... అవకాశం దొరికినప్పుడల్లా అలనాటి మేటి తారల్లా అభినయిస్తూ వస్తున్నాను. నటులే కాదు... ఇంట్లోవాళ్లు, సన్నిహితులను అనుకరించడం కూడా నాకు ఒక అలవాటుగా మారిపోయింది. అమ్మమ్మలు, బామ్మలు, తాతయ్యలు... ఇలా పెద్దవాళ్ల హావభావాలను సరదాగా నాలో పలికిస్తుండేదాన్ని. దాంతోపాటు పాటలు పాడేదాన్ని. డ్యాన్స్ చేసేదాన్ని. చూసినవాళ్లందరూ బాగా ఆస్వాదించేవారు. అభినందించేవారు. వారి పొగడ్తలు నాకు మరింత ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చేవి. అలా మొదలైంది నా ఈ ప్రయాణం. మా ఊరు భద్రాచలం. నేను అక్కడే పుట్టి పెరిగాను. 2010లో హైదరాబాద్‌లో ఎంబీయే పూర్తయింది.

ఉద్యోగం... పెళ్లి...

డిగ్రీ అవ్వగానే ఓ ఆంగ్ల పత్రికలో ఏడాదిన్నర సేల్స్ మార్కెటింగ్ విభాగంలో పని చేశాను. తరువాత ఆరేళ్ల రేడియో సిటీలో ఉద్యోగం. అక్కడ మార్కెటింగ్‌తో పాటు ప్రకటనలకు వాయిస్ ఓవర్ ఇచ్చేదాన్ని. అదే సమయంలో నాకు పెళ్లయింది. మావారు సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నారు. తన ఉద్యోగ నిమిత్తం ఫ్రాన్స్‌కు వెళ్లాం. కొన్నాళ్లకు తిరిగి భారత్‌కు వచ్చేశాం. ఆయనకు మంచి ఉద్యోగ అవకాశం రావడంతో 2021లో అమెరికాకు పయనమయ్యాం. ప్రస్తుతం ఇక్కడే నివాసం.

అమెరికా వచ్చాక...

మొదటి నుంచీ అందర్నీ అనుకరించడంవల్ల క్రమంగా నా ఆసక్తి నటన వైపు మళ్లింది. అమెరికా వచ్చాక అనిపించింది... ఒక ప్రయత్నం చేద్దామని. ఒకప్పుడంటే సినిమాలు, టీవీలు మినహా వేరే అవకాశాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు సామాజిక మాధ్యమాల వల్ల మన ప్రతిభ ప్రపంచానికి చూపడానికి అనువైన ఒక చక్కని వేదిక అందుబాటులో ఉంది కదా. దాని ద్వారా నాలోని నటిని సంతృప్తి పరచాలని అనుకున్నా. చిన్నప్పటి నుంచీ ఇమిటేట్ చేస్తున్నాను కాబట్టి... కంటెంట్ కూడా దానికి సంబంధించే పెట్టాలనుకున్నా. అలా మూడేళ్ల కిందట ఇన్‌స్టాగ్రామ్‌లో నా పేరు మీదనే ఒక చానల్ ప్రారంభించాను.

మధుర జ్ఞాపకాలెన్నో...



ప్రముఖ నటుడు హర్షవర్ధన్ గారు ఒక ఇంటర్వ్యూలో నా గురించి ప్రత్యేకంగా చెప్పారు. సూర్యకాంతంలా బాగా నటిస్తున్నానని. ఆ వీడియో ఎవరో నాకు పంపించారు. చూసి ఆశ్చర్యపోయాను. ఆయనతో నాకు పరిచయం లేదు. ఒక మెసేజ్ కూడా పంపారు... 'ఆ బాడీ లాంగ్వేజ్, ఆ వాయిస్ అనుకరణ అంత సులువు కాదు. కానీ మీరు సూర్యకాంతంలా అతికినట్టు చేస్తున్నారు. నేను మీకు పెద్ద అభిమానిని. మా కుటుంబం అంతా కూర్చొని మీ వీడియోలు చూస్తాం' అని. అలాగే సంగీత దర్శకుడు తమన్ తన ఇన్‌స్టా స్టోరీలో నా వీడియోలు షేర్ చేశారు. చార్మి, అవసరాల శ్రీనివాస్, నందినీరెడ్డి లాంటి పరిశ్రమ ప్రముఖులు అభినందన మెసేజ్‌లు పంపడమే కాదు, వాటిని ఇతర సామాజిక మాధ్యమాల్లో పంచుకొంటున్నారు కూడా. కొంత మంది అసిస్టెంట్ డైరెక్టర్‌లు, సినిమాటోగ్రాఫర్‌లు 'అవకాశం వస్తే సినిమాల్లో నటిస్తారా' అని అడుగుతున్నారు. తప్పకుండా చేస్తానని వారికి చెప్పాను. నా లక్ష్యం కూడా అదే.

నిర్మలమ్మ గారి రీల్‌తో...

చదువుకొనే రోజుల్లో డ్రామా, డ్యాన్స్ ప్రదర్శనలు ఇచ్చేదాన్ని. కాలేజీలోనే కాదు... బయటి వేదికలపై కూడా. కానీ ఎవరి దగ్గరా శిక్షణ తీసుకోలేదు. అన్నీ నాకు నేను చూసి నేర్చుకున్నవే. ఇన్‌స్టాలో చిన్న చిన్న వీడియోలు చేసి పెట్టాను కానీ... వాటికి అంత గుర్తింపు రాలేదు. 'శ్రీ కనకమహాలక్ష్మి రికార్డింగ్ డ్యాన్స్ ట్రూప్' చిత్రంలో నిర్మలమ్మ గారు నటించిన కోడి సన్నివేశం ఒకటి ఉంటుంది. ఆ బిట్ నేను చేశాను. దానికి మంచి స్పందన వచ్చింది. లక్షల మంది వీక్షించారు. అంతకు మించి షేర్ చేశారు. నాకు మంచి గుర్తింపు తెచ్చింది. ఆ ఉత్సాహంతో సూర్యకాంతం గారిని అనుకరించే ధైర్యం చేశా.

'ఏంటి నేను ఇంత లావున్నానా'...

అయితే నాకు బాగా పేరు వచ్చింది మాత్రం సూర్యకాంతం గారి వీడియోతో. రేలంగి గారితో కలిసి ఆమె నటించిన 'ఏంటి నేను ఇంత లావున్నానా' సన్నివేశం ఒకటి ప్రయత్నించాను. ఆ రీల్‌కు ఊహించనంత స్పందన లభించింది. సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొట్టింది. నాకు బాగా పేరు వచ్చింది. ఇక అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఏ వీడియో పెట్టినా లక్షల్లో వ్యూస్. తరువాత ఛాయాదేవి గారిని అనుకరించాను. వాటికీ విపరీతమైన ఆదరణ లభించింది. వాస్తవానికి ఆ సలహా ఇచ్చింది రఘు కుంచె గారు. 'మీరు ఛాయాదేవి గారి పాత్రలు కూడా ప్రయత్నించండి. బాగా చేస్తారు' అన్నారు. ఆయన చెప్పాకే ఆవిడవి మొదలుపెట్టాను.

ఐదు వందలకు పైనే...

ఇప్పటివరకు నేను ఐదు వందలకు పైగా వీడియోలు చేశాను. ఇన్‌స్టాలో లక్షన్నర మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. అత్యధికంగా చూసిన వీడియో సూర్యకాంతం గారిది. దానికి వ్యూస్ రెండు కోట్లు దాటాయి. ఆ తరువాత వరుసలో బ్రహ్మానందం, నిర్మలమ్మ, ఛాయాదేవి గారి వీడియోలు. అన్నీ నా మొబైల్ ఫోన్‌తోనే తీస్తాను. ముందుగా సన్నివేశం ఏంటనేది నిర్ణయించుకొని, ఓ అరగంట సాధన చేసి, నటిస్తాను. ఎడిటింగ్ లాంటివన్నీ నేనే చూసుకొంటాను. ఒక్కో వీడియోకు సగటున ఐదు లక్షల వ్యూస్ వస్తాయి. కాస్ట్యూమ్స్ ఇంట్లో ఉన్నవాటితోనే సరిపెడుతుంటా. అవి కుదరకపోతే షాపింగ్ చేస్తాను. కొన్ని భారత్ నుంచి కూడా తెప్పిస్తుంటాను. ఇక్కడ ఒక్కటే చెప్పదలుచుకున్నాను... సామాజిక మాధ్యమాలవల్ల ప్రతికూలతలు, అలాగే అనుకూలతలు కూడా ఉన్నాయి. దాన్ని మనం ఎలా ఉపయోగించుకొంటామనేది ముఖ్యం. ఒకప్పుడు నేరుగా వెళ్లి వేషాలు అడగాలంటే భయపడేదాన్ని. కానీ రీల్స్ వల్ల నాకు ఆ భయం పోయింది. నన్ను నేను ప్రపంచానికి పరిచయం చేసుకోగలిగాను. ఇది నాకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తోంది. కాస్త గర్వంగానూ అనిపిస్తుంది."

అదే నా బలం...

నేను చిన్నప్పటి నుంచీ సూర్యకాంతం, నిర్మలమ్మ సినిమాలు ఆసక్తిగా చూసేదాన్ని. దాంతో వాళ్ల నటన మీద కొంత అవగాహన వచ్చింది. ప్రత్యేకించి సూర్యకాంతాన్ని అనుకరించడం చాలా కష్టమనేది చాలామంది చెప్పే మాట. ఆవిడ డైలాగ్ డెలివరీ వేగంగా సాగిపోతుంది. డైలాగ్‌కు డైలాగ్‌కు మధ్య విరామం ఉండదు. నటనలో, మాటలో ఫోర్స్ ఉంటుంది. కానీ ఏదీ తెచ్చిపెట్టుకున్నట్టు కాకుండా, ఎంతో సహజంగా అనిపిస్తుంది. ఇంకో ప్రత్యేకత ఏంటంటే... నిలుచున్న మనిషి నిలుచున్నట్టే, కదలకుండా డైలాగులు చెప్పేస్తారు. అలా మా ఇంట్లో నాయనమ్మలు, అమ్మమ్మలను చూసేదాన్ని. వాళ్లను అనుకరించడంవల్ల ఇప్పుడు నేను ఇంత బాగా చేయగలుగుతున్నాను. కాంచన, భానుమతి, బ్రహ్మానందం, కోవై సరళ, ఆమని, సౌందర్య తదితరులని కూడా అనుకరిస్తుంటాను. ఎవరినైనా చూస్తే వారి హావభావాలను వెంటనే పట్టేయగలను. అదే నా బలం.

• హనుమా

చెద పురుగులు పట్టాయా?

కంప్యూటర్ టేబుల్, డైనింగ్ టేబుల్ వద్ద కలరా వుండలు ఉంచితే చెద పురుగులు చేరవు.

మన ఇంట్లో చెక్క అల్మారాలు, మంచాలు, తలుపులకు చెద పురుగులు పడుతూ ఉంటాయి. ఎంతో ఖరీదైన చెక్కను తెచ్చి ఇష్టంగా చేయించుకున్న అరలతో సహా పుస్తకాలు, దుస్తులను కూడా ఇవి పాడుచేస్తుంటాయి. ఒకసారి చేరితే వీటిని వదిలించుకోవడం చాలా కష్టం. రసాయనాలతో కూడిన స్ప్రేలకు బదులు కొన్ని ఇంటి చిట్కాలు ఉపయోగించి కొంతమేరకు వీటి బెడదను తగ్గించుకోవచ్చు.

- చెద పురుగులను నివారించడంలో కర్పూరం పొడి ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇవి ఎక్కువగా చేరే మంచాలు, తలుపులు, కిటికీలు, అరల మూలల్లో సందుల్లో కర్పూరం పొడిని చల్లితే రెండు రోజుల్లో మంచి ఫలితం కనిపిస్తుంది.
- ముదురు వేపాకులను తెచ్చి ఎండబెట్టి మెత్తని పొడిలా చేయాలి. ఈ పొడిని గది మూలల్లో, అరల్లో, చెక్క సమాన్ల మీద చల్లితే వారం రోజుల్లో చెద పురుగులన్నీ చనిపోతాయి.
- పుస్తకాలు, దుస్తులు భద్రపరచుకునే చెక్క బీరువాల్లో;
- చెదపురుగులు ఉన్నాయన్న అనుమానం వచ్చిన ప్రదేశాల్లో చిటికెడు నల్ల జీలకర్ర ఉంచినా మంచి ఫలితం కనిపిస్తుంది.
- మంచాలు, సోఫాలు, టేబుళ్లు, కుర్చీల మీద కొద్దిగా వెనిగర్ చిలకరిస్తే ప్రయోజనం ఉంటుంది.
- ఇంట్లో ఉండే సామాన్లు, పుస్తకాలను ఎక్కువకాలం ఒకేచోట ఉంచకుండా కనీసం ఆర్నెల్లకోసారి కదిలిస్తూ ప్రదేశాలు మారుస్తూ ఉంటే చెదలు చేరవు.



లీచీ.. ఔషధ గుణాలెన్నో



ఎర్రగా చూడగానే తినేయాలనిపించే లీచీ పండు వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వాటి గురించి తెలుసుకుందాం..

- లీచీల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తికి ఊతమిస్తుంది.
- ఈ పళ్లలోని ఫైబర్ అజీర్తి, మలబద్ధకం సమస్యలను దూరం చేస్తుంది.
- లీచీల్లో నీటి శాతం ఎక్కువ. కాబట్టి డీహైడ్రేషన్ ముప్పు తప్పుతుంది.
- లిచి పళ్లలోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె సమస్యలను ఇది దరిచేరనీయదు.
- లీచీల్లో క్యాలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు నియంత్రణకు ఈ పండ్లు బాగా ఉపయోగపడతాయి.
- ఇందులోని విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

వంటగది శుభ్రం ఇలా..

అద్దంలా మెరిసే వంటగది అహ్లాదకరంగా ఉంటుంది. వంటగది పరిశుభ్రంగా లేకపోతే క్రిమి కీటకాలు చేరడమే కాకుండా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వంట చేసేటప్పుడు చికాకుగా అనిపిస్తుంటుంది. కాబట్టి ఇంట్లో దొరికే వస్తువులతో సులువుగా వంటగదిని ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం...

- వంట చేసేటప్పుడు వెలువడే పొగ, ఆవిరి వల్ల స్టవ్ వెనక గోడపై అమర్చిన టైల్స్ మీద జిడ్డు చేరుతూ ఉంటుంది. ఒక్కోసారి పసుపు, కారం, మసాలాల మరకలు కూడా పడుతుంటాయి. అలాంటప్పుడు ఒక గిన్నెలో నాలుగు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని టైల్స్ మీద రాసి రెండు నిమిషాల తరవాత స్క్రబ్బర్ లేదా స్పాంజ్‌తో రుద్దాలి. తరవాత గోరువెచ్చని నీళ్లతో కడిగేస్తే టైల్స్ చక్కగా శుభ్రమవుతాయి. వంట పూర్తయిన వెంటనే టిష్యూ పేపర్‌తో టైల్స్‌ని తుడిచేస్తే ఏ సమస్యా ఉండదు.



- వంట చేస్తున్నప్పుడు స్టవ్ కింద, దాని చుట్టూ కూడా ఆహార పదార్థాలు చింది పడుతూ ఉంటాయి. వంట పూర్తయిన తరవాత వీటిని పలుచని గుడ్డతో శుభ్రంగా తుడవాలి. రెండు గ్లాసుల గోరువెచ్చని నీళ్లలో ఒక చెంచా ఉప్పు, రెండు చెంచాల వెనిగర్ లేదా లిక్విడ్ సోప్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గట్టు మీద చల్లి పది నిమిషాలు ఉంచాలి. తరవాత వేడినీళ్లు పోసి కడిగేస్తే గట్టు పూర్తిగా శుభ్రపడుతుంది. ఇదేవిధంగా స్టవ్‌ని కూడా శుభ్రం చేయవచ్చు.
- వంటగదిలో ఉండే ట్యూబ్‌లైట్, ఎగ్జాస్ట్ ఫ్యాన్, స్విచ్ బోర్డులతోపాటు కిటికీ ఊచలు, తలుపులు కూడా జిడ్డు పట్టి దుమ్ము, ధూళితో నిండుతుంటాయి. అలాంటప్పుడు సర్ఫ్ లేదా లిక్విడ్ సోప్ కలిపిన నీళ్లలో ముంచి గట్టిగా పిండిన స్పాంజ్‌తో వీటిని తుడిచేస్తే సరిపోతుంది.
- అటకమీద, అరల్లో తరచూ బూజు పడుతూ ఉంటుంది. దీన్ని మెత్తని చీపురు లేదా వ్యాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయాలి. అరల మూలల్లో కర్పూరం బిళ్లలు, లవంగాలు, వేపాకుల్లో ఒకటి ఉంచితే బొద్దింకలు చేరవు.
- వంటగదిలో నేలను ప్రతిరోజూ ఉప్పునీటితో తుడవాలి. పాత్రలు కడిగే సింక్‌లో కొన్ని వేడి నీళ్లు పోసి బ్రష్‌తో రుద్ది శుభ్రం చేయాలి.

స్ఫూర్తి

డైవింగ్ సంచలనం



ఎలాంటి పరికరాలు లేకుండా ఊపిరి బిగపట్టి లోతైన నీళ్లలోకి డైవ్ చేయడమే ఫ్రీ డైవింగ్. ఎంతో కష్టమైన, క్లిష్టమైన ఈ క్రీడలో పైచేయి సాధించడమే కాకుండా, ఏకంగా తొమ్మిది జాతీయ రికార్డులను నెలకొల్పారు చెన్నైకి చెందిన 32 ఏళ్ల అర్చన శంకర నారాయణన్. ఈ మహిళా డైవర్ గురించిన ఆసక్తికరమైన విశేషాలివి.

ఆరేళ్ల కిందట... కొత్త సంవత్సర వేడుకల కోసం అండమాన్‌కు వెళ్లినప్పుడు, అర్చనకు మొదటిసారిగా డైవింగ్ చేసే అవకాశం దొరికింది. అలా జీవితంలో మొదటిసారిగా స్కూబా డైవింగ్ చేశారామె. ఆ అనుభవం గురించి వివరిస్తూ... "నాకా అనుభవం ఎంతో బాగా నచ్చింది. నీటి అడుగున దాగి ఉండే అద్భుతమైన ప్రపంచాన్ని నేనప్పుడు మొదటిసారిగా చూడగలిగాను. సముద్రంతో తక్షణ అనుబంధం ఏర్పడిపోయిన భావనకు లోనయ్యాను. నీటి ప్రపంచంలో నెలకొని ఉండే ప్రశాంతత, నిశ్శబ్దం నన్నెంతో అబ్బురపరిచాయి. అలా మొదటి అనుభవంతోనే డైవింగ్‌కు ఎంతో దగ్గరైపోయాను. నా భవిష్యత్తు డైవింగ్‌తో ముడిపడి ఉందని అనిపించింది. కానీ అప్పటికే న్యాయవాద వృత్తిలో ఉన్నాను. కాబట్టి డైవింగ్ పట్ల ఏర్పడిన మక్కువను నా తల్లితండ్రులు అర్థం చేసుకోలేకపోయారు. అది ప్రాణాంతకమైన క్రీడ కాబట్టి వాళ్లు బాగా భయపడిపోయారు. మాది సంప్రదాయ తమిళ కుటుంబం. న్యాయవాద వృత్తిని వదిలేసి, ప్రాణాంతకమైన డైవింగ్‌లో కొనసాగాలనే నా కోరికను మొదట్లో వ్యతిరేకించిన తల్లితండ్రులు చివరకు అర్థం చేసుకుని ప్రోత్సహించారు. ఇప్పుడు నన్ను చూసి గర్వపడుతున్నారు" అంటూ తన డైవింగ్ ప్రయాణాన్ని వివరిస్తున్నారు అర్చన.

ఫ్రీడైవింగ్... అంత సులువు కాదు

నీళ్ల అడుగుకి డైవ్ చేయడం, సులభతరమైన క్రీడలాగే అనిపించవచ్చు. కానీ నీళ్లలో లోతుకు ప్రయాణించేకొద్దీ నీటి ఒత్తిడి పెరిగిపోతుంది. ఆక్సిజన్ మోతాదులు తగ్గిపోతాయి. దాంతో మెదడుకు సరిపడా ఆక్సిజన్ అందక స్పృహ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఊపిరితిత్తుల మీద ఒత్తిడి పెరిగి, అవి కుంచించుకుపోతాయి. నీటి ఒత్తిడిలో చోటుచేసుకునే మార్పుల వల్ల కళ్లు, చెవులు, సైనస్‌లు, ఊపిరితిత్తులకు గాయలయ్యే అవకాశాలుంటాయి. లోతుకు చేరుకున్న తర్వాత అంతే వేగంగా నీళ్ల పైకి చేరుకునే వీలుండదు. అలా లోతు నుంచి వేగంగా నీటి పైకి ప్రయాణిస్తే, రక్తంలో నైట్రోజన్ బుడగలు ఏర్పడి, డీకంప్రెషన్ సిక్‌నెస్‌కు గురవుతారు.

లోతులన్నీ నెగ్గి...

అర్చన తాజాగా ఫిలిప్పైన్స్‌లో జరిగిన రెండు ప్రధాన అంతర్జాతీయ పోటీల్లో ఆరు కొత్త జాతీయ రికార్డులను నెలకొల్పారు. ఈ చెన్నై యువతి, రెండు అంతర్జాతీయ పోటీల్లో ఆరు జాతీయ రికార్డులను బద్దలు కొట్టడంతో పాటు, 35 మీటర్ల జాతీయ రికార్డును నెలకొల్పి, 42 మీటర్ల ఫ్రీడైవింగ్ తో స్వీయ వ్యక్తిగత ప్రతిభను కనబరచడం విశేషం. ఇలా ఏడాది వ్యవధిలో తొమ్మిది రికార్డులను నెలకొల్పిన తొలి భారతీయ మహిళా ఫ్రీడైవర్‌గా చరిత్ర సృష్టించారు. ఫ్రీడైవింగ్ ఊపిరిని బిగపట్టే క్రీడ. ఈ క్రీడలో పాల్గొనే క్రీడాకారులు ఎలాంటి శ్వాస పరికరాలు లేకుండా, నీటి అడుగున వీలైనంత లోతుకు ఫ్రీడైవింగ్ చేస్తూ ఉంటారు. అర్చన, గత నెలలో ఫిలిప్పైన్స్‌లోని మబినిలో జరిగిన ఎఐడిఎ మబిని డెప్త్ క్వెస్ట్‌లో పాల్గొని, తన రికార్డును బద్దలు కొట్టడంతో పాటు నాలుగు జాతీయ రికార్డులతో తన అసమానమైన ప్రతిభను చాటుకున్నారు. అనంతరం ఫిలిప్పీన్స్ పాంగ్లోలో జరిగిన హగ్ కప్ పోటీల్లో, మరొక సొంత రికార్డుతో పాటు, రెండు జాతీయ రికార్డులను నెలకొల్పారు. ఇలా ఇప్పటివరకూ అర్చన, కాన్‌స్టెంట్ వెయిట్, కాన్‌స్టెంట్ వెయిట్ బై ఫిన్స్, కాన్‌స్టెంట్ వెయిట్ నో ఫిన్స్, ఫ్రీ ఇమ్మర్షన్... ఇలా ఈ క్రీడలోని నాలుగు డెప్త్ విభాగాల్లో జాతీయ రికార్డులను సాధించి భారత దేశ సత్తాను చాటారు.

మక్కువతో మథించి...

ఆ ప్రయాణంలో భాగంగా మొదట బహిరంగ జలాల స్కూబా అడ్వాన్స్‌డ్ సర్టిఫికేషన్‌ను పొంది, రెస్క్యూ డైవర్‌గా మారారు. ఆ తర్వాత, ఎటువంటి ఆక్సిజన్ ఆసరా లేకుండా ఫ్రీడైవింగ్ చేసే భారత దేశానికి చెందిన శుభమ్ పాండే వీడియోలు చూసి అతని నుంచి ఎంతో ప్రేరణ పొందారు. ఆ సందర్భం గురించి మాట్లాడుతూ.. "నన్నీ క్రీడ విపరీతంగా ఆకర్షించింది. కేవలం రెస్క్యూ డైవర్‌గా స్థిరపడిపోకుండా, ఈ క్రీడలో మరింత పరిణతి సాధించాలని అనుకున్నాను. శుభమ్ వీడియోలు చూసిన తర్వాత, అతని దగ్గర శిక్షణ పొందాలని అనిపించింది. దాంతో బాలి వెళ్లి, భారతీయ అగ్ర ఫ్రీడైవింగ్ శిక్షకుల్లో ఒకడైన శుభమ్ దగ్గర శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత, ఆసియాలోని సుప్రసిద్ధ ఫ్రీడైవింగ్ స్కూల్, ఆప్నియా బాలిలో కూడా శిక్షణ పొందాను" అంటూ చెప్పుకొచ్చారు అర్చన. శిక్షణలో భాగంగా ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడం కోసం విజువలైజేషన్, బ్రెత్‌వర్క్, ధ్యానం... సాధన చేశారామె. డయాఫ్రమ్ బ్రీదింగ్ లాంటి శ్వాస నైపుణ్యాలను సాధన చేయడం ద్వారా డైవింగ్ నైపుణ్యాన్ని పెంచుకోవడంతో పాటు, మహాసముద్రంలో ఆత్మవిశ్వాసంతో డైవింగ్ చేయగలిగే సామర్థ్యం కూడా పెరిగిందని అంటున్నారామె. అలాగే థాయిల్యాండ్‌లోని కొ టావోలో క్రైజెన్ ఫ్రీడైవింగ్‌లో కూడా అర్చన శిక్షణ తీసుకున్నారు. ఫ్రీడైవింగ్ ప్రపంచ రికార్డులు, 100 మీటర్లను అధిగమించాయి కాబట్టి భారతదేశ డైవర్లు ఈ క్రీడలో పైచేయి సాధించడానికి కఠోర శిక్షణ పొందడం అవసరమని గ్రహించిన అర్చన, ప్రస్తుతం తన శిక్షణ తీవ్రతను పెంచారు. "ఆగష్టు 1 నుంచి 3 వరకు, ఇండోనేషియాలోని, నార్త్ సులవేసిలో జరగబోయే మనాడొ డెప్త్ కాంపిటీషన్‌లో నెగ్గడం కోసం, శుభమ్ పాండేతో కలిసి ఇండోనేషియాలోని అమెడ్‌లో శిక్షణ తీసుకుంటున్నాను" అంటూ చెప్పుకొస్తున్నారు.

ప్రియుడితో కలిసి... భర్తను హతమార్చిన భార్య

● తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో ఘటన ● కేసు నమోదు చేసిన పోలీసులు

బిక్కవోలు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): భర్తను భార్య తన ప్రియుడితో కలసి హత్య చేసిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు జగనన్న కాలనీలో జరిగింది. అనపర్తి సీఐ సుమంత్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బిక్కవోలుకు చెందిన కెంగం శ్రీను (42)కు, అదే గ్రామానికి చెందిన దేవితో 20ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు గ్రామంలోని అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నారు. శ్రీను కూలీ పనులు చేసుకుంటూ మద్యానికి బానిసై రోజు మద్యం తాగి వచ్చి దేవిని హింసించేవాడు. దీంతో ఆమె ఒక వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగించింది. శ్రీనుపై విరక్తి చెందిన దేవి ప్రియుడితో కలిసి మంగళవారం అర్ధరాత్రి మద్యంమత్తులో ఉన్న శ్రీను తలవెనుక, ముఖంపై గాయపరచి హతమార్చింది. కొట్టిన దెబ్బల కారణంగా శ్రీను చనిపోయాడని, తన కోడలు మరొకరు కలసి చంపేశారంటూ మృతుడి తల్లి సరస్వతి ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా శ్రీను ముఖంపై, తల వెనుక గాయాలున్నాయని, ఇద్దరు కలిసి కొట్టి చంపినట్టుగా భావిస్తూ కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు. దేవీ, ఆమె ప్రియుడు పరారీలో ఉన్నారన్నారు. రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీ బి.విద్య సంఘటనా స్థలాన్ని పరిశీలించి శ్రీను తల్లి నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ ఆధారాలు తీసుకున్నారు. మృతదేహాన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ ఉన్నారు.


శ్రీను మృతదేహం

వాసాలతిప్పలో జస్వంత్ మృతదేహం లభ్యం

ఉప్పలగుప్తం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఎస్.యానాం బీచ్‌లో మంగళవారం ఇద్దరు యువకులు స్నానానికి దిగి గల్లంతైన సంగతి తెలిసిందే. వీరిలో అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన యాళ్ళ హరికిశోర్ మృతదేహం దొరికింది. కాగా అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన ఇసుకపట్ల జస్వంత్(19) మృతదేహం బుధవారం వాసాలతిప్ప ఓఎన్జీసీ సైట్ సమీపంలో లభ్యమైనట్టు ఎస్ఐ సీహెచ్. రాజేష్ తెలిపారు. తహశీల్దార్ వాసా వీఎస్ దివాకర్ రెవెన్యూ సిబ్బందితో కలిసి వాసాలతిప్పలో జస్వంత్ మృతదేహాన్ని పరిశీలించారు. సమీపంలో ఉన్న తండ్రి వెంకటరమణకు చూపించి పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.


జస్వంత్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ దివాకర్, ఎస్ఐ రాజేష్


జస్వంత్ ఫైల్‌ఫొటో

జేఎన్టీయూకేలో డైరెక్టరేట్ల మార్పు

జేఎన్టీయూకే, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పరిపాలనా సంస్కరణల్లో భాగంగా కాకినాడ జేఎన్టీయూలో ఉన్న పలు డైరెక్టరేట్లను మార్పు చేస్తూ ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ ఆదేశాల మేరకు వర్శిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఐఎస్టీ డైరెక్టర్‌గా డాక్టర్ బీటీ కృష్ణ, ఐటీ, ఓఎల్, ఓడీఎల్‌కు సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కెసహదేవయ్య, అలూమ్ని ఇంటర్నేషనల్ రిలేషన్స్ డైరెక్టర్‌గా ఎ.స్వర్ణకుమారిని నియమించారు. అదేవిధంగా స్టూడెంట్ ఎఫైర్స్‌కు ప్రొఫెసర్ కృష్ణమోహన్‌ను, ఐక్యూఏసీ డైరెక్టర్‌గా కె.రవీంద్రను, అడ్మిషన్స్, సెట్స్‌కు రాము నియమితులయ్యారు. ఎస్ఐఐఐసీకి ఎ.గోపాలకృష్ణ, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్‌గా ప్రొఫెసర్ జి.పద్మజారాణి, లీగల్‌మ్యాటర్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ బాలాజీ, అకడమిక్స్ డైరెక్టర్‌గా ఎంహెచ్‌ఎంకృష్ణప్రసాద్‌నునియమించారు.

ఆంజనేయస్వామి విగ్రహాన్ని బయటపడేసిన వ్యక్తి అరెస్ట్

రిమాండ్ విధింపు

తొండంగి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం పెరుమాళ్ళపురం పంచాయితీ శివారు చింతకాయలపేటలో ఉన్న సీతారాముల ఆలయంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని బయటపడేసి నష్టం కలిగించిన వ్యక్తిని గుర్తించి అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. కొత్తపెరుమాళ్ళపురం గ్రామానికి చెందిన తిర్రి ప్రసాద్ (26) ఈ దుశ్చర్యకు పాల్పడినట్టు గుర్తించామన్నారు. మద్యం మత్తులో ఏమి చేస్తున్నాడో తెలియని పరిస్థితిలో ఆంజనేయ విగ్రహాన్ని బయటపడవేశాడన్నారు. బుధవారం ప్రసాద్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. ఇటువంటి చర్యలకు ఎవరు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బాబోయ్..భారీ వర్షం!

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటపాటు కురిసిన ఈ వర్షానికి హైటెక్ బస్టాండ్ మునిగింది. దీంతో వాహనదారులు బాబోయ్ అంటూ నీటిలో వాహనాలను తోసుకుంటూ, ఒకరికి ఒకరు సాయం చేసుకుంటూ వెళ్లారు.

రాజమహేంద్రవరంలో మునిగిన హైటెక్ బస్టాండ్



నీటిమయమైన హైటెక్ బస్టాండ్‌లో ఉండిపోయిన ప్రజలు




వర్షపు నీటిలో నుంచి చేతులు పట్టుకుని వస్తున్న ప్రజలు


నీటిలో పడకుండా భుజాలపై తరలిస్తూ..


వర్షం నీటిలో కారు

నేటి నుంచి 'ఎరెవ్నా 4.0'

జీజీహెచ్(కాకినాడ) జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల, ఫార్మకాలజీ లెక్చర్ గ్యాలరీలో ఎరెవ్నా 4.0 సదస్సు గురువారం ప్రారంభంకానుంది. 3 రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు అతిథులుగా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ చంద్రశేఖర్ డీఎంఈ డాక్టర్ రఘునందన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి హాజరుకానున్నారు. ఈ సదస్సు ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో జరగనుంది. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వైద్యులు, వైద్య విద్యార్థులు హాజరుకానున్నారు. వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల నైపుణ్యతను మరింత మెరుగుపర్చే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సదస్సులో వర్క్‌షాపులు, పేపర్ ప్రజంటేషన్‌లు, ప్రపంచవ్యాప్తంగా అధునాతన వైద్య పరమైన మార్పులు వాటిలో సానుకూలప్రతికూల అంశాలపై చర్చించనున్నారు.

నేడు చిరంజీవినీకుమారి సంస్మరణ సభ

కాకినాడ రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ విద్యావేత్త, మానవతావాది ఐడియల్ విద్యాసంస్థల కరస్పాండెంట్, కార్యదర్శి డాక్టర్ పాలెపు చిరంజీవినీకుమారి ఈనెల 1న మరణించారు. ఆమె సంస్మరణార్థం కాకినాడ-సామర్లకోట రోడ్డులోని ఐడియల్ కళాశాల ప్రాంగణంలో గురువారం సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్టు పూర్వ విద్యార్థి దామెర మురళీ తెలిపారు. ఈ సభలో ఆమె అభిమానులు, సాహిత్య ప్రజాసంఘాలువారు, పురప్రముఖులు, రాజకీయ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొని నివాళులర్పించాలని కోరారు.

అంతర్వేదిలో వైభవంగా మహా జ్యేష్ఠాభిషేకం


మహా జ్యేష్ఠాభిషేకానికి జలాలను తీసుకెళ్తున్న అర్చకులు, అధికారులు

అంతర్వేది, జూన్ 11(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలోని అంతర్వేది పుణ్యక్షేత్రం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జ్యేష్ఠా నక్షత్ర మహాపర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి మూలవరులకు సప్తనదీ జలాలతో మహా జ్యేష్ఠాభిషేకం, మహాశాంతి హోమం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య, అర్చక, వేద పండితులు, పండితోత్తములతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, చతుర్దశ కలశారాధన, నవకలశారాధన, పంచామృత కలశారాధన, సప్తనదీ కలశ ఆవాహనాలు, ఆరాధనలు, విశేష అర్చనలు, అగ్ని మధనము, అగ్ని హోత్రములు చేపట్టారు. అర్చకులు, అధికారులు కలశములతో సప్త నదీ జలాలను తీసుకుని ఆలయ ప్రదక్షిణ చేసి అగ్ని ప్రతిష్ఠాపన అనంతరం నదీ జలాలు, చతుర్దశ కలశాలు, పంచామృత కలశలతోను స్వామివారి మూలవరులకు మహాజ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పూర్ణాహుతిలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాజా బహదూర్, రాష్ట్రమార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు, రాజోలు నీటిసంఘం చైర్మన్ పినిశెట్టి వెంకటస్వామి, వైస్ చైర్మన్ ఆకన బాబ్జినాయుడు, దిరిశాల బాలాజీ పాల్గొన్నారు.

తైక్వాండో చాంపియన్‌గా ఉమ్మడి జిల్లా


మెడల్స్ సాధించిన తైక్వాండో క్రీడాకారులు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 11(ఆంధ్ర జ్యోతి): అనంతరం జిల్లా తాడిపత్రిలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో చాంపియన్‌గా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నిలిచింది. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొనగా 38 గోల్డు, 12 సిల్వర్, 17 బ్రాంజ్ మొత్తం 67 మెడల్స్ సాధించి 43 వ రాష్ట్రస్థాయి పోటీల్లో ఓవరల్ చాంపియన్‌గా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నిలిచింది. రెండో స్థానంలో కడప, మూడోస్థానంలో అనంతరం జిల్లాలు నిలిచాయని జిల్లా సెక్రెటరీ బి.అర్జున్‌రావు తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను డీఎస్డీవో శ్రీనివాస్ కుమార్, జిల్లా ఒలింపిక్ సెక్రెటరీ, ప్రెసిడెంట్లు అభినందించారు. కార్యక్రమంలో నేషనల్ రిఫరల్ ఎస్.సాయి, రోహిత్ జోషి, మణికంఠ, పిభార్గవి అభిషేక్ పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

తుని రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో వ్యక్తి అను మానాస్పదంగా మృతిచెందిన ఘటన కలకలం రేపింది. 16వ నంబరు జాతీయ రహదారిని అనుకుని కొండవారిపేట సమీపంలో చర్చి ఎదురుగా ఉన్న పొదల్లో వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. మృతి చెందిన వ్యక్తి పిఠాపురం రూరల్ కోలంక గ్రామానికి చెందిన నంద్యాల వీరభద్రరావు (35)గా తుని సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. అతడు ఈనెల కనిపించకుండాపోవడంతో పిఠాపురం పోలీస్ స్టేషన్లో కేసు నమోదైనట్టు ఆయన చెప్పారు.

రాజమహేంద్రవరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం

» గోదావరి పుష్కర ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి



గోదావరి పుష్కర ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము, శాప్‌చైర్మన్ నాయుడు, కమిషనర్ కేతన్‌గార్గ్

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 2వ డివిజన్ వెంకట్రామయ్యనగర్‌లో మునిసిపల్ సాధారణ నిధులు రూ.కోటి91లక్షలు, శాప్‌నిధులు రూ.కోటి 50లక్షలు కలిపి మొత్తం రూ.3కోట్ల41లక్షల నిధులతో నిర్మించిన గోదావరి పుష్కర ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, శాప్‌చైర్మన్ అనిమిని రవినాయుడు, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కమిషనర్ కేతన్‌గార్గ్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా గోదావరి పుష్కర ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో విభాగాలను ఆదిరెడ్డి వాసు, శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజులు ప్రారంభించారు.

అనంతరం కాంప్లెక్స్‌లో టేబుల్ టెన్నిస్, బిలియర్డ్స్, రైఫిల్ షూటింగ్, క్యారమ్స్, చెస్‌లను కొద్దిసేపు ఆడి ఉత్తేజపరిచారు. అనంతరం ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాజమహేంద్రవరం చరిత్రలో గోదావరి పుష్కరాలు ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఒక మైలు రాయిగా నిలిచిపోతుందన్నారు. కాంప్లెక్స్‌లో కేరమ్స్, చెస్, టేబుల్ టెన్నిస్, షూటింగ్, స్నూకర్ బిలియర్డ్స్‌తోపాటు జిమ్ కూడా ఉంద న్నారు. ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ద్వారా నగరపాలక సంస్థకు ఏటా రూ.10లక్షల ఆదాయం సమకూరనుందని తెలిపారు. ఖేల్ ఇండియా ద్వారా వీఎల్ పురం లారీ స్టాండ్ వద్ద రూ.50 కోట్లతో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ముందుకు వెళ్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్సీ సోమువీర్రాజు మా ట్లాడు తూ క్రీడా సంస్కృతిని పెంపొందించడానికి కేం ద్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు పేరుతో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తిరుపతి తర్వాత రాజమహేంద్రవరంలోనే రైఫిల్ షూటింగ్ ఉన్నట్లు చెప్పారు. మరోవైపు క్రీడలపట్ల మక్కువతో ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడా రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు రవినాయుడు తెలిపారు. ఇప్పటివరకు ఉద్యోగాల్లో ఉన్న క్రీడా కోటా రిజర్వేషన్‌ను 2శాతం నుంచి 3శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన వారికి రూ.7కోట్ల నగదు ప్రోత్సాహంతోపాటు గ్రూ ప్-1 ఉద్యోగం అవకాశాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. తాజా డీఎస్సీ నోటిఫికేషన్ కింద క్రీడా కోటాలో 421 పోస్టులను కేటాయించినట్లు తెలిపారు. రానున్నరోజుల్లో రాజమహేంద్రవరంలో వాటర్స్ గేమ్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అనంతరం కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నగరంలో యువతలోదాడివున్న క్రీడానైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ ఇండోర్ స్పోర్ట్స్‌కాంప్లెక్స్ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వైశ్రీనివాస్, వర్రే శ్రీనివాసరావు, మజ్జి రాంబాబు, ఉప్పులూరి జానకి రామ య్య, నక్కా దేవి వరప్రసాద్, బుడ్డిగ రాధా, కోసూరి చండీప్రియ, తురకల నిర్మల, కప్పల వెలుగు కుమారి, కురగంటి సతీష్ పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌జీవో నాయకులు

ఆఫీస్ బేరర్స్‌కు రాయితీ ఇవ్వాలి

జీజీహెచ్(కాకినాడ)జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మెడికల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ఏపీ ఎన్‌జీవో సంఘంలో ఆఫీస్ బేరర్స్‌గా పని చేస్తున్న ఉద్యోగులను వారు ఆఫీస్ బేరర్స్ గా ఎన్నికైన నాటి నుంచి 9 సంవత్సరాల వర కు అదే స్టేషన్‌లో పనిచేసేందుకు మినహాయింపు ఇవ్వాలని ఏపీ ఎన్‌జీవో సంఘ నాయకులు బుధవారం డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహ నాయక్‌ను కలిసి వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన క్లారిఫికేషన్‌ను డీఎంహెచ్‌వోకు వివరించి బదిలీలు పారదర్శకంగా చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీ ఎన్‌జీవో సంఘ అధ్యక్షుడు జి.రామ్మోహన్ రావు, కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, సరెళ్ళ చంద్రరావు, రామకృష్ణ, చార్లెస్ పాల్, అరదాడి సత్తిరాజు పాల్గొన్నారు.

కేశవదాసుపాలెంలో గ్యాస్ లీకేజీ

అంతర్వేది, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం బెల్లకొండవారి మెరక సమీపంలో బుధవారం రాత్రి స్వల్పంగా గ్యాస్ లీకేజీ అయింది. కొత్తగా వేసిన పైపులైను నుంచి గ్యాస్ లీకవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అడుగు భాగాన ఉన్న గ్యాస్ పైపులైను నుంచి గ్యాస్ లీకవడంతో ఆ ప్రదేశంలో ఉన్న నీటిలో నుంచి బుడగలు రావడంతో ఓఎన్జీసీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. తరచూ అక్కడ గ్యాస్ లీకవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇళ్ల మధ్యలో నుంచి పైపులైను వెళ్లి తరచూ గ్యాస్ లీకేజీలు జరుగుతుండడంతో భయభ్రాంతులకు గురవుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. దీనిపై ఓఎన్జీసీ అధికారులు చర్యలు తీసుకుని గ్యాస్ లీకేజీని శాశ్వతంగా అరికట్టాలని గ్రామస్తులు కోరారు.


కేశవదాసుపాలెం గ్రామంలో ఓఎన్జీసీ పైపులైను నుంచి లీకవుతున్న గ్యాస్

ఉచిత నిర్బంధ విద్య పిల్లల హక్కు

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి):ఉచిత నిర్బంధవిద్య పొందడం పిల్లల హక్కు అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్‌జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. 'నల్సా-బాలబాలికలకు స్నేహపూర్వక న్యాయ సేవల పథకం-2024', 'మానసిక అనారోగ్యం, మేధో వైకల్య వ్యక్తులకు చట్టపరమైన సేవల పథకం-2024'పై బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత నిర్బంధ విద్య పొందడం 6 నుంచి 14ఏళ్లలోపు పిల్లలకు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. వివిధ కారణాలవల్ల బడికి దూరమైన వారిని గుర్తించి మళ్లీ చదువుకునే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దివ్యాంగులకు ఉన్న సేవలను సమర్థ వంతంగా అందించాలన్నారు. డీఎల్ఎస్ఏ ద్వారా అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవల గురించి పిల్లలకు వివరించారు. అనంత రం ప్రజలకు అందించాల్సిన చట్టపరమైన హక్కుల విషయమై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందా ల్సిందేనని స్పష్టం చేశారు. ఈవిషయంలో ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఆమె సూచించారు. ప్రభుత్వాస్పత్రి డాక్టరు హరిచంద్ర, జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ లీగల్ అధికారి గౌరి, డీటీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరు నెలల్లోనే నిర్మాణాలను పూర్తిచేస్తాం

● శాప్ చైర్మన్ రవినాయుడు

దివాన్‌చెరువు, జూన్11 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఖేలో ఇండియానిధులతో నిర్మిస్తున్న నిర్మాణాలను ఆరునెలల్లో పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఖేలో ఇండియా నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా అధికార్లు, కాంట్రాక్టరు, విశ్వవిద్యాలయ ఇంజనీర్ గత పాలకులు అనాలోచిత నిర్ణయాలవల్ల పనులలో జాప్యం జరిగిందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని అన్నారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తయ్యేందుకు రూ.6.10కోట్లు, స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి రూ3.16 కోట్లు అవసరం అవుతుందన్నారు. నన్నయ వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ శాప్ సహకారంతో ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలను పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయం, శాప్ అధికార్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


నిర్మాణ పనులు పరిశీలిస్తున్నశాప్ చైర్మన్ రవినాయుడు

జీజీయు, కేపీఎంజీ, మెక్వైరీ వర్శిటీల మధ్య ఎంవోయూ

రాజానగరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయు) ఆస్ట్రేలియాలోని ప్రఖ్యాత మెక్వైరీ యూనివర్శిటీ, ప్రముఖ సంస్థ కేపీఎంజీ ఇండియాతో అవగాహన ఒప్పందాలు(ఎంవోయు)చేసుకుంది. ఈసందర్భంగా జీజీయు ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణ రాజు(చైతన్యరాజు)జీజీయు క్యాంపస్‌లో నిర్వహి ంచిన ప్రత్యేక సమావేశంలో ఇందుకు సంబ ంధించిన ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఈకార్యక్రమంలో జీజీయు ప్రో ఛాన్సలర్ కె.శశికిరణ్ వర్మ మాట్లాడుతూ కేపీఎంజీ, మెక్వైరీ యూనివర్శిటీలతో ఎంవోయు జరగడం జీజీయు చరిత్రలో ఒక మైలురాయి గా నిలిచిపోతుందన్నారు. ముఖ్యంగా బీటెక్ కోర్సులో సైబర్ సెక్యూరిటీ స్పెషలైజేషన్ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. దీంతో విద్యార్థులకు అంతర్జాతీయస్థాయిలో అవకాశాలు లభిస్తాయన్నారు. జీజీయు ఛాన్సలర్ చైతన్య రాజు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలతో బోధన అందించేందుకు జీజీయూ ఎల్లప్పుడూ ముందుండే సంస్థ అని అన్నారు. కే జీఎంజీ ఇండియా ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ డవలప్‌మెంట్, గవర్నమెంట్ అండ్ పబ్లిక్ సర్వీసెస్ నేషనల్ లీడర్ నారాయణన్ రామస్వామి మా ట్లాడుతూ డిజిటల్ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో జీజీ యూ వంటి విశ్వవిద్యాలయాలతో కలిసి పనిచేయడం ద్వారా విద్యా ర్థులకు ప్రతిభను ప్రదర్శించే అవకాశాలు కలుగుతాయన్నారు. అతిథులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మెక్వైరీ యూనివర్శిటీ సైబల్ స్కిల్స్ అకాడమీ సీఈవో మేట్‌బుష్బీ ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. కేపీఎంజీ ఇండియా నుంచి మహవీర్ అగర్వాల్, రాఘవన్ ఎస్, జీజీయుసాంకేతిక సలహాదారు సుమంత్, వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రోవైస్ చాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, డీన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

ఏడాది.. ఏమైంది..

కందుల దుర్గేష్, పర్యాటక శాఖ మంత్రి, నిడదవోలు ఎమ్మెల్యే



● ఎన్నికల హామీలు- ప్రస్తుత పరిస్థితి : నిడదవోలు ప్రభుత్వాస్పత్రిని 30 పడకల నుంచి 100 పడకలు చేయడానికి చర్యలు తీసుకున్నారు. జగన్ రివర్స్ టెండరింగ్‌లో ఆగిపోయిన మినీ స్టేడియం నిర్మాణానికి త్వరలోనే పనులు మొదలు కానున్నాయి.

● ప్రతిపాదనలు- నిధుల మంజూరు : నియోజకవర్గ అభివృద్ధికి రూ.227కోట్లు ఖర్చు చేశారు. మరో రూ.180కోట్ల పనులు జరుగతున్నాయి. సీఎంఆర్‌ఎఫ్ ఫండును 127 మందికి రూ.1.34కోట్లు అందజేశారు.

● ప్రజలకు చేరువయ్యేందుకు : మంత్రిగా బిజీగా ఉన్నా ప్రజలకు చేరువగా ఉంటారు. ఎవరు ఏ కార్యక్రమానికి పిలిచినా హాజరవుతారు. ప్రజల్లో ఎప్పుడూ ఉంటారు. నియోజకవర్గంలో ఎలాంటి ప్రమాదాలు జరిగినా అర్ధరాత్రి అయినా బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించి చేతనైన సాయం చేస్తున్నారు. ప్రభుత్వ పరిహారం అందేలా చూస్తున్నారు.

గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే



● ఎన్నికల హామీలు-ప్రస్తుత పరిస్థితి : ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు చేసిన విషయం తెలిసిందే. ఆ చట్టం అయిన తర్వాత రూరల్ మండలంలో వైసీపీ చేసిన అరాచకాలపై విచారణ చేయడానికి చర్యలు తీసుకున్నారు. 250 కొత్త పించన్లు మంజూరు చేయించారు. రూ.6 కోట్లతో రోడ్ల మరమ్మతులు పూర్తయ్యాయి. ఇంకా రూ.144 కోట్ల పనులు పూర్తి కావొస్తున్నాయి. రూ.20 కోట్లతో డ్రైన్లు, రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఎంపీ ల్యాడ్స్ ద్వారా రూ.50 లక్షల పనులు... పంట ముంపు నివారణకు రూ.3 కోట్లు ఖర్చుచేశారు.

● ప్రతిపాదనలు : రూ.130 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదించారు. గోదావరి కాలుష్య నివారణ పథకం కింద రూ.550 కోట్లతో డీపీఆర్ తయారవుతోంది. సీఎంఆర్‌ఎఫ్‌లో రూ.1.30 కోట్లు 104 మందికి అందజేశారు. సీఎస్ఆర్‌లో పేపరుమిల్లు, గెయిల్ సహకారంతో రూ.3 కోట్లతో ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నారు. ఇరిగేషన్‌లో పొట్టిలంక తదితర ప్రాంతాల అభివృద్ధికి రూ.9 కోట్లు ప్రతిపాదనలు పంపారు. ఈస్ట్ రైల్వేస్టేషన్, గాదాలమ్మనగర్ తదితర రోడ్ల విస్తరణకు ప్రపోజల్స్ రెడీ అయ్యాయి.

● ప్రజలకు చేరువయ్యేందుకు : నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారు. ప్రతి రోజూ నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతూ ఉంటారు. నాయకులను, అధికశాతం ప్రజానీకాన్ని ఎన్నాళ్లు గడిచినా పేరుతో గుర్తుపట్టి పిలవడం ఆయన ప్రత్యేకత.

ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే



● ఎన్నికల హామీలు-ప్రస్తుత పరిస్థితి : ఆరోగ్యకరమైన రాజమహేం ద్రవరం ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. దీని అమలుకు ప్రభుత్వాస్పత్రిని ప్రతి 15 రోజులకు తనిఖీ చేస్తున్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ రూ.69 లక్షలతో ఆస్పత్రిలో పరికరాలను ఏర్పాటుచేశారు. పోస్టుమార్టం విభాగానికి కొత్త ఫ్రీజర్లు ఇప్పించారు. సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.1.25కోట్లు బాధి తులకు అందజేశారు. నగరంలో 30 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్లను రూ.24.5 కోట్లతో నిర్మిస్తు న్నారు. డ్రైన్లను 26.5 కిలోమీటర్ల మేర రూ.5 కోట్లతో పునరుద్ధరిస్తున్నారు. 25 ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేశారు. 30 పార్కులను ఆధునికీకరించారు. థీమ్ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. రూ.20 కోట్లతో రివర్ ఫ్రంట్ వ్యూ నిర్మాణం ప్రారంభమైంది. ఈ ఏడాదిలో రూ. 250 కోట్లతో పనులు చేపట్టి 80 శాతం పూర్తి చేశారు. రూ.98 లక్షలతో వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. అమరావతి సొల్యూషన్ కంపెనీలో రాజమండ్రి యువతకు 40 మందికి శిక్షణ ఇప్పించి 26 మందికి ఉద్యోగాలు ఇప్పించారు.

● ప్రతిపాదనలు- నిధుల మంజూరు: రూ.50 కోట్లతో ఖేల్ ఇండియా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించాలని ప్రతిపాదనలు పంపారు. మునిసిపల్ స్టేడియాన్ని రంజీ మ్యాచ్‌లు నిర్వహించే స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అమృత్ భారత్‌లో భాగంగా రూ.22 కోట్లు కేంద్రం కేటాయించింది. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ రావడానికి కృషిచేశారు.

● ప్రజలకు చేరువయ్యేందుకు : అధికారంలోకి రాగానే మహిళల కోరిక మేరకు 'మీ భద్రత-మా బాధ్యత' కింద సదస్సులు నిర్వహించి 53 మంది అసాంఘిక వ్యక్తులపై కేసులు నమోదు చేయించి, ఐదుగురిపై రౌడీషీట్లు తెరిపించారు.

బత్తుల బలరామకృష్ణ, రాజానగరం ఎమ్మెల్యే



● ఎన్నికల హామీలు-ప్రస్తుత పరిస్థితి : కవలచర్లలో ఏపీఐఐసీకి సంబంధించి 104 ఎకరాల్లో పరిశ్రమల స్థాపనకు పనులు మొదలయ్యాయి. రూ.70 కోట్లతో రహదారి పనులు పూర్తిచేశారు. 68 ఎకరాల్లో ఫారెస్ట్ అకాడమీ రూ.642 కోట్లతో ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. స్వరూప్ నగర్‌లో రూ.70 కోట్లతో విద్యుత్ పంపిణీ కేంద్రం నిర్మాణం పూర్తయింది. కోరుకొండ గుడికి రూ.36 కోట్లతో రోప్‌వే ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించాల్సి ఉంది. శ్రీరాంపురం రోడ్డును రెండులేన్లుగా విస్తరించనున్నారు.

● ప్రతిపాదనలు-నిధులు మంజూరు : చాగల్నాడు కాలువ పూడికతీత పనులకు, పంపింగ్ హౌస్‌కి షట్టర్ల రిపేరుకు రూ.1 కోటి నిధులు మంజూరు చేయించారు. సీఎంఆర్‌ఎఫ్ సుమారు రూ.5 కోట్లు బాధితులకు అందజేశారు.

● ప్రజలకు చేరువయ్యేందుకు : జనవాణి కార్యక్రమంతో షెడ్యూల్ ప్రకారం ఒక మండలంలో ప్రజలతో సమావేశం ఏర్పాటుచేసి అధికారులతో అక్కడికక్కడే పరిష్కారం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

నల్లమిల్లి రామకృష్ణారెడ్డి , అనపర్తి ఎమ్మెల్యే



● ఎన్నికల హామీలు-ప్రస్తుత పరిస్థితి: వేమగిరి-కాకినాడ కెనాల్ రోడ్డుకు రూ.8 కోట్లతో మరమ్మతులు చేయించారు. సామర్లకోట, కాకినాడ ప్రధాన పంట కాలువల్లో గత ఐదేళ్లగా పూడుకుపోయిన గుర్రపుడెక్కను ఉపాధి హామీ కూలీలతో తొలగించారు. రంగంపేట మండలంలోని అధ్వానంగా ఉన్న ప్రధాన రోడ్లను రూ.6.50 కోట్లతో అభివృద్ధి చేశారు. అనపర్తి మండలంలో రామవరం-రాయవరం రహదారి రూ.1.50కోట్లతో బాగుచేశారు. రెండు ఫేజుల్లో నాలుగు మండలాల్లో సుమారు రూ.30కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు పనులు జరుగుతున్నాయి. సగానికి పైగా ప్రారంభమయ్యాయి. మొత్తంగా నియోజకవర్గంలో అన్ని పనులూ కలిపి రూ.95 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. అనపర్తి ఏరియా ఆస్పత్రిలో రూ.12 కోట్లతో నూతన భవన నిర్మాణాలు జరుగుతున్నాయి.

● ప్రతిపాదనలు-నిధులు మంజూరు : కెనాల్ రోడ్ పీపీపీ విధానంలో నిర్మించడానికి సర్వే జరుగుతోంది. ఈ రోడ్డు బాగా పాడైనచోట కొత్తగా రోడ్డు నిర్మించారు. అనపర్తి-బిక్కవోలు రోడ్డుకు రూ.5.30 కోట్లతో ప్రతిపాదనలు పంపగా రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. 8 దేవాలయాల అభివృద్ధికి రూ.12 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు.

● ప్రజలకు చేరువయ్యేందుకు : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారు. రోజుకు కనీసం మూడు మండలాల్లో పర్యటిస్తారు.

ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఎమ్మెల్యే



● ఎన్నికల హామీలు-ప్రస్తుత పరిస్థితి : ఎక్స్‌ప్రెస్ ట్రైన్లు, బస్సులు కొవ్వూరులో నిలుపుదలకు చర్యలు తీసుకున్నారు. కొవ్వూరు ప్రభుత్వాస్పత్రి రినోవేషన్‌కి రూ.1 కోటితో ప్రారంభోత్సవం చేశారు. సోషల్, బీసీ వెల్ఫేర్ వసతి గృహాల పునఃనిర్మాణానికి రూ.3.65 కోట్లతో ప్రతిపాదనలను పంపారు. రెండు ఎస్టీ హాస్టళ్లరు రూ.3.92 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. నియోజకవర్గంలో 32 కిలోమీటర్ల సీసీ రోడ్లను రూ.6.72 కోట్లతో పూర్తిచేశారు. డ్రైన్లు రూ.1.31కోట్లతో 6 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేశారు. నేషనల్ మిషన్ కింద మార్కొండపాడు, మలకపల్లిలో బ్లాక్ హెల్త్ సెంటర్ ల్యాబ్స్‌ని రూ.1కోటితో పూర్తిచేశారు. రూ.72 లక్షలతో 13 బోర్లు, రూ.3.66 కోట్లతో 12 కిలోమీటర్లతో రోడ్లు వేశారు. రూ.6.56కోట్లతో 7 ఆర్ అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేశారు. 226 మందికి సీఎంఆర్‌ఎఫ్ రూ.2.34కోట్లు ఇచ్చారు.

● ప్రతిపాదనలు-నిధులు మంజూరు: కొవ్వూరు పట్టణంలో రూ.69.70 కోట్లతో గోదావరి ఉపరితల జలాలను తాగునీరుగా అందించడానికి డీపీఆర్‌ని ప్రభుత్వానికి సమర్పించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద ఎస్సీ ప్రాంతాల్లో 58సీసీ రోడ్లకు రూ.3.81కోట్లతోను, రూరల్ వాటర్ వర్క్స్ పథకంలో 100 పనులకు రూ.24.20కోట్లకు ప్రతిపాదనలు పంపారు.

● ప్రజలకు చేరువయ్యేందుకు: నియోజకవర్గ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. వారంలో ఒక రోజు ఎమ్మెల్యే గ్రీవెన్స్ నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తున్నారు.

మద్దిపాటి వెంకట్రాజు, గోపాలపురం ఎమ్మెల్యే



● ఎన్నికల హామీలు-ప్రస్తుత పరిస్థితి : గోపాలపురంలోని ముంపు సమస్య పరిష్కారానికి నిధులు తీసుకొ చ్చారు. ఎర్రకాలువ, తాడిపూడి, కొవ్వాడ కాలువలకు వచ్చే వరద లకు ప్రతి ఏటా 6 వేల ఎకరాలు మునిగిపోతోంది. ఈ పనులకు రూ.2కోట్లు నిధులు మంజూరుచేయించి పనులుచేయిస్తున్నారు. బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.3కోట్లు అందజేశారు.

● ప్రతిపాదనలు-నిధులు మంజూరు : నియోజకవర్గంలో రూ.50 కోట్లతో 570 రోడ్ల పనులను పూర్తిచేశారు. వీటిలో మరమ్మతులు చేసినవాటితోపాటు కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు ఉన్నాయి. గోపాలపురం మండలంలో 57 పనులకు 4.94కోట్లు, దేవరపల్లి 150 పనులు రూ. 9.68కోట్లు, నల్లజర్ల 164 పనులకు రూ.19.86కోట్లు, ద్వారకాతిరుమల 166 పనులకు రూ. 13.98కోట్లు వెచ్చించారు. 4 మండలాల్లో ఒక్కో ప్రభుత్వాస్పత్రికి 4 ఏసీలు సమకూర్చారు.

● ప్రజలకు చేరువయ్యేందుకు: 'గ్రామదర్శిని' పేరుతో కార్యక్రమాన్ని మొదలుపెట్టి నియోజకవర్గంలోని 85 పంచాయతీల్లోని ప్రతి ఇంటికి వెళ్లి బాగోగులు తెలుసుకున్నారు. గ్రామాల్లో సమస్యలను అంచనా వేసి ఆ మేరకు చర్యలకు ఉపక్రమించారు. తన గౌరవ వేతనంతో ఆరుగొలను గురుకుల పాఠశాలకు ఆర్‌వో ప్లాంటును కొనిచ్చారు.

హౌసింగ్ లేఅవుట్లలో క్వాలిటీ కంట్రోల్‌పై సమీక్ష

రాజమహేంద్రవరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): హౌసింగ్‌కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనలో చేపట్టే పనుల విషయంలో నాణ్యతా ప్రమాణాల నిర్ధారణకు పాటించే పరీక్షల్లో తప్పనిసరిగా ఖచ్చితత్వం ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఆమె బుధవారం సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. మాట్లాడుతూ గృహ నిర్మాణాల లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● తొస్సిపూడి, గాడాల, తొర్రేడు గ్రామాల్లో ఏరువాక పనులు ప్రారంభం



తొస్సిపూడిలో దుక్కు దున్నుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఏ రువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఆయ న తొస్సిపూడిలో ద్వారంపూడి వెంకటరెడ్డి రైతు పొలంలో ప్రత్యేక పూజలు చేసి నాగలితో దున్ని వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని రైతులకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత ఖరీఫ్, రబీలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలుచేసి 24గంటల్లో రూ.79కోట్లు చెల్లించిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. ఎంపీపీ తేతలి సుమ, కూటమి నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, చింతా శ్రీనివాసరె డ్డి, అనపర్తి ఏడీఏ డీవీ కృష్ణ, తహసీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఏవోలు శామ్యూల్‌జాన్, సురేష్, శ్రీనివాస్, మణిదీప్ పాల్గొన్నారు.

ప్రతి రైతు ఒక ఎంటర్‌ప్రెనర్‌గా ఎదగాలి

కోరుకొండ: రాష్ట్రంలోని ప్రతిరైతు ఒక ఎంటర్‌ప్రెనర్‌గా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ ఉద్దేశమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా కోరుకొండ మండలం గాడాల గ్రామంలో తొర్రేడు పుంతరోడ్డు వద్ద ఖరీఫ్ వ్యవసాయానికి రైతులతో కలిసి శ్రీ కారం చుట్టారు. ముందుగా నాగలికి పూజలు చేసి కొబ్బరికాయ కొట్టి భూమినిదున్నారు. అనంతరం ఎడ్లబండిపై కూర్చుని బండినడిపి విత్తనాలు చల్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి కార్యక్రమం ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నా నన్నా రు. కార్యక్రమంలో జనసేన నాయకులు అడపా శ్రీనివాస్, ముక్కా రాంబాబు, అడ్డాల శివ, వ్యవసాయశాఖ ఏడీ మల్లికార్జునరావు, ఇతర వ్యవసాయశాఖ అధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతన్న రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది



గాడాలలో నాగలి పట్టిన ఎమ్మెల్యే బలరామకృష్ణ

రాజమహేంద్రవరంరూరల్ : జాతికి మెతుకునిచ్చి బతుకునింపే రైతన్న రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదని రాజమహేంద్రవరం రూరల్ మండల వ్యవసాయ అధికారి భీమరాజు అన్నారు. ఏరువాక పున్నమి సందర్భంగా బుధవారం తొర్రేడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామ టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దళారుల నుంచి విముక్తి కలిగించి రైతన్నకు గిట్టుబాటు ధర కల్పించినప్పుడే రైతు ఆనందంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయవిస్తరణ అధికారులు వేణుమాధవ్, పిటర్ , తొర్రేడు వ్యవసాయ కమిటి సభ్యులు దాసరి రామచంద్రావు, చిట్టూరి శ్రీధర్, దండమూడి వీర్రాజు, మద్దుకూరి లక్ష్మణ్, వాసు, మల్లిన మురళీ, సాయిబాబా, విఏఏలు ఎన్‌డి శ్రీనివాస్, సురేఖ, రమాదేవి, రాహుల్, నాగబాబు, హేమంత్ పాల్గొన్నారు.

నేడు బస్‌పాస్‌ల జారీ నిలిపివేత

రాజమహేంద్రవరంఅర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్‌పాస్ అప్లికేషన్ల ఆధునీకరణ జరుగుతున్న కారణంగా ఈనెల 12వ తేదీ గురువారం బస్‌పాస్‌ల జారీ నిలిపివేసినట్లు విద్యార్థినీ విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని ఆర్టీసీ జిల్లా అధికారి వైఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఆధునీకరణ పూర్తిచేసిన తర్వాత 13వ తేదీ శుక్రవారం నుంచి యథావిధిగా బస్‌పాసులు జారీ చేస్తామని, అలాగే కొత్త బస్‌పాస్‌లను ఆన్‌లైన్ ద్వారా కూడా పొందవచ్చని తెలిపారు. బస్‌పాస్‌ఆన్‌లైన్.ఏపీఎస్ఆర్టీసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా అప్లికేషన్ పూర్తిచేసి దాన్ని కౌంటర్ వద్ద అందజేస్తే విద్యార్థులకు సమయం ఆదా అవుతుందని ఆయన పేర్కొన్నారు.

స్వతంత్ర హాస్పటల్స్‌కు ఎన్ఏబీహెచ్ అక్రిడిటేషన్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని స్వతంత్ర హాస్పటల్స్ మల్టీస్పెషాలిటీస్‌కు రోగుల భద్రత, సంరక్షణ, కార్యాచరణకు సంబంధించి ప్రతిష్టాత్మకమైన ఎన్ఏబీహెచ్ అక్రిడిటేషన్ సర్టిఫికెట్ లభించిందని హాస్పటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.వేణుగోపాల్ తెలిపారు. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు చెందిన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హాస్పటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ నుంచి ఈ సర్టిఫికెట్‌ను అందుకుంటామని తెలిపారు. 100 పడకల సామర్థ్యంతో ఈ ఏడాది మే 8వ తేదీ నుంచి 2029 మే 9వ తేదీ వరకూ ఈ అక్రిడిటేషన్ చెల్లుబాటు అవుతుందని ఆయన పేర్కొన్నారు.

రైట్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

దివాన్ చెరువు, జూన్11 (ఆంధ్రజ్యోతి): భూపాలపట్నంలోని రైట్ ఇంజనీరింగ్ కళాశాలకు యూజీసీ స్వయంప్రతిపత్తి హోదాను మంజూరు చేసిందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అడ్డాల శ్రీహరి తెలిపారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. ఈ ఘనత సాధించడంలో భాగమైన ప్రతీఒక్కరికీ చైర్మన్ జి.సాయిరాధాకృష్ణ, కోశాధికారి రవికిరణ్, ప్రిన్సిపాల్ భాస్కర ముత్యాలు, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. స్వయం ప్రతిపత్తిహోదాద్వారా కళాశాల స్వతంత్రంగా పాఠ్యాంశాలను రూపొందించుకుని అవసరాలకు అనుగుణంగా కోర్సులు అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు.

సీఎఫ్ఈఎస్‌డీపీ సమన్వయకర్తగా సంజీవరావు నియామకం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) :రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉపాధి నైపుణ్యాభివృద్ధి, నియామక కేంద్రం (సీఎఫ్ఈఎస్‌డీపీ) సమన్వయకర్తగా తెలుగు విభాగాధిపతి పీవీబీ సంజీవరావును నియమిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపణ్యం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఒక ప్రకటన విడుదల చేస్తూ విద్యార్థినీ విద్యార్థుల్లోని నైపుణ్యం, సామర్థ్యానికి అనుగుణంగా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే, కార్యదర్శిగా వైస్వర్ణశ్రీ, సభ్యులుగా ఎంఎస్ ఫణికుమార్, ఎం.లలిత రమ్య, ఎస్.శివప్రసాద్, ఎస్.రాజ్‌కుమార్, విద్యార్థులు అనూష వర్ధిని, రిష్యేంద్ర గుప్తా వ్యవహరిస్తారని తెలిపారు.

సమస్యాత్మక భూములు బాగుచేసుకోండి

దివాన్‌చెరువు, జూన్11 (ఆంధ్రజ్యోతి): సమస్యాత్మక భూములను తగిన యాజమాన్య చర్యలను అవలంబించి బాగుచేసుకుంటే పంటలలో దిగుబడులు పెంచుకోవచ్చునని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ ఉషారాణి అన్నారు. దివాన్‌చెరువులోని ఏరువాక కేంద్రంలో వ్యవసాయ పరపతి సంఘం ఎరువుల డీలర్లు సర్టిఫికెట్ కోర్సు శిక్షణలో భాగంగా సమస్యాత్మక భూములు-సవరణలు అనే అంశంపై బుధవారం ఆమె ప్రసంగించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు, శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

కోరుకొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీఅగ్రనాయత్వం ఇచ్చిన పిలుపుమేరకు తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ జీకే విశ్వేశ్వర రెడ్డి నాయకత్వంలో బుధవారం కోరుకొండలో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య సంరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ, ఉద్యమం ర్యాలీ నిర్వహించారు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద ముందుగా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఇంటింటికి కాంగ్రెస్ కరపత్రాలు విడుదల చేశారు.

ఆర్యాపురం బ్యాంక్‌ను అగ్రగామిగా అభివృద్ధి చేస్తాం

● బ్యాంక్ చైర్మన్ చల్లా

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను రాష్ట్రంలోని సహకార బ్యాంక్‌లలో అగ్రగామిగా అభివృద్ధి చేస్తామని బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ పాలకమండలిగా తమ కమిటీ ఎన్నికయ్యేనాటికి బ్యాంక్ ఎస్ఎఎఫ్ ఆంక్షలు విధించబడి వుందన్నారు. తమ పాలక మండలి కృషి ఫలితంగా ఎన్‌పీఏ రికవరీ చేయటం ద్వారా గతనెల 5న ఎస్ఎఎఫ్ ఆంక్షలను ఆర్‌బీఐ ఎత్తివేసిందన్నారు. సుమారు రూ.95 కోట్లు ఎన్‌పీఏ లోన్స్‌ను రికవరీ చేసి ఎన్‌పిఎను తగ్గించగలిగామన్నారు. వైస్ చైర్మన్ పోలాకి పరమేష్ మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో వైసీపీ పాలకులు బ్యాంక్‌ను భ్రష్టు పట్టించారని చెప్పారు. డైరెక్టర్ యెనుముల రంగబాబు మాట్లాడుతూ ఆర్థిక శాస్త్రవేత్త చల్లా శంకర్రావు నేతృత్వంలో బ్యాంక్ చాలా వేగంగా రికవరీ చేశామన్నారు. ఈనెల 15న రాజమహేంద్రవరం స్టేడియం వెనుక ప్రాంతంలోని గంటా గన్నిరాజు కళ్యాణ మండపంలో మధ్యాహ్నం 3గంటలకు బ్యాంక్ సాధారణ మహాజనసభ నిర్వహిస్తున్నామని ఇందులో రూ.కోటి 90లక్షల డివిడెంట్‌ను ఖాతాదారులకు చైర్మన్ పంచుతున్నారని చెప్పారు. సమావేశంలో బ్యాంక్ డైరెక్టర్లు పిల్లి శ్యామ్‌కుమార్, యాళ్ల వెంకట్రావు, పడాల శ్రీనివాస్, పెదకాపు, కప్పల సూర్యప్రకాశరావు, నీలపాల సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్బన్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లు పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో అర్బన్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లు పంపిణీ చేశారు. బుధవారం రాజమహేంద్రవరంలో పాఠశాలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి కిట్లు చేరాయని అర్బన్ డీఐ దిలీప్‌కుమార్ తెలిపారు. అర్బన్‌లో మొత్తం 67,734 పుస్తకాలు రాగా దాదాపు 65,400 పుస్తకాలు పాఠశాలల పాయింట్స్‌కు చేర్చినట్లు డీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎంఈవో - 2 రమాదేవి, సీఆర్ఎంటీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, పబ్బిసీడి ప్రసాద్, ఇందిర కుమారి, కోటేశ్వరి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో బాలబాలికలను చేర్పించండి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో ఎస్సీఎస్టీబీసీ, మైనార్టీల బాలబాలికలను చేర్పించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ జేఏసీ చైర్మన్ కోరుకొండ చిరంజీవి కోరారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వం సదుపాయాలను కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

దివ్యాంగుల పెన్షన్లు తొలగిస్తే రాష్ట్రవ్యాప్త ఉద్యమం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పెన్షన్లను వివిధ కారణాలు చూపించి తొలగిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని అఖిలభారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు తెలిపారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయనమాట్లాడారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో దివ్యాంగులకు జారీ చేసిన సదరన్ సర్టిఫికేట్లు ఇప్పుడు చెల్లవని పింఛన్లు తొలగించాలనుకోవడం దారుణమన్నారు.

సమర్థవంతమైన పాలన చంద్రబాబుకే సాధ్యం: ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం, జూన్11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన సీఎం చంద్రబాబుతోనే సాధ్యపడుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరంలో బుధవారం సాయంత్రం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారంచుట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి వెళుతుంటే వైఎస్. జగన్ చూసి ఓర్వలేకపోతున్నాడన్నారు. నియోజకవర్గంలో ముసురుమిల్లి రిజర్వాయర్‌ను ఇంకో సంవత్సర కాలంలో ప్రాజెక్టుకు గేట్లు అమర్చి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పనిచేస్తున్న ప్రభుత్వం

● రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరంరూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రూరల్ నియోజకవర్గం పరిధిలో సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. రూరల్ మండలం పిడిం గొయ్యి పరిధిలో బుచ్చయ్యనగర్ ప్రాంతంలో రూ.2.50కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలకు బుధవారం స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్రం ఎన్నో ఆర్థిక ఒడిదుడుకులు ఉన్నప్పటికీ కేంద ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతోపాటు సంక్షేమం కూడా అందిస్తుందన్నారు. రూరల్ మండల పరిధిలో రూ.13.50కోట్లతో పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామని, కడియం మండల పరిధిలో రూ.6.50కోట్లతో పనులు ప్రారం భిస్తున్నట్లు పేర్కొన్నారు.ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవరావు, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సరళా వందనం, జ్యోతి, మత్యేటి ప్రసాద్, వాసిరెడ్డి రాంబాబు, కోరాడ వెంక టేష్, బొప్పన నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, కార్యదర్శి సూర్య నారాయణ సంబంధిత అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అనపర్తిని అగ్రగామిగా నిలబెడతా

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి: అభివృద్ధిలో అనపర్తిని అగ్రగామిగా నిలపడమే ధ్యేయంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అనపర్తి మండలంలోని పెడపర్తి, అనపర్తి గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే భూమిపూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనపర్తి మండలం పెడపర్తిలో రూ.39.15లక్షల నిధులతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.12లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. అనపర్తిలో రూ.13లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం

రంగంపేట: రాష్ట్రంలో ఉన్న గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలో గల జి.దొంతమూరు గ్రామంలో రూ.19లక్షలతో నిర్మించే రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన,గ్రామ శివారు బాలవరంలో రూ.9లక్షలతో నిర్మాంచి సీసీ రోడ్డును ప్రారంభించారు. మండలంలో పలుగ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవిందు, మండల అధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు మైలవరపు సాయిరామ్, జనసేన మండల అధ్యక్షుడు గిరజాల సాయిరామ్, జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జడ్పీకోఆప్షన్ సభ్యుడు లంకచంద్రన్న, ఎన్డీయే కూటమినాయకులు పోతుల వెంకట్రాజు, శ్రీను, మాచిన వెంకన్నదొర, ఎన్డీయే కూటమి నాయకులు, ఎంపీ డీవో సాయిబాబు, జెఈ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొమరిపాలెంలో సీసీ రోడ్లు ప్రారంభం

బిక్కవోలు: కొమరిపాలెంలో గ్రామ పంచాయతీ నిధులు రూ.17.50లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, ఎంపీపీ తేతలి సుమ, కూటమి నేతలు పడాల రాము, దుర్గారెడ్డి, కర్రి శ్రీనివాసరావు, కొవ్వూరి గోవిందరెడ్డి, డీవీఆర్, తేతలి సూర్యచంద్రారెడ్డి పాల్గొన్నారు.





ఏడాది.. ఏమైంది..



కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టిన జిల్లా ఎమ్మెల్యేలు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో బీజేపీ మద్దతుతో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి గురువారంతో ఏడాది పాలన పూర్తి చేసుకుంది. నాటి సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించి అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు సాగిన పాలన తీరును ప్రజలు నిశితంగానే పరిశీలిస్తున్నారు. వైసీపీ పాలనకు, కూటమి పాలనకు మధ్య స్పష్టమైన మార్పులనూ గమనిస్తున్నారు. ఈ ఏడాదిలో ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరును సైతం జనం బేరీజు వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో ఎమ్మెల్యేలు ఇచ్చిన ప్రధాన హామీలేంటి.. వాటి ప్రస్తుత పరిస్థితి ఏంటి, ప్రతిపాదనలు చేసిన పనులు, మంజూరైన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు చేరువయ్యేందుకు వారు ఏం చేస్తున్నారనే విషయాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

6



నేటి నుంచి బడులు పునః ప్రారంభం



రాజమహేంద్రవరం, జూన్11(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిశాయి. 2025-26 విద్యా సం వత్సరం గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఈమేరకు బడులు సిద్ధమయ్యాయి. పాఠశాలల తెరిచిన నాటి నుంచే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను అందజేయనున్నారు. గత వైసీపీ ప్రభుత్వం అందజేసిన వాటికంటే నాణ్యమైన మెటీరియల్‌ని అంతకంటే తక్కువ ధరకే కొనుగోలు చేసిన ప్రభుత్వం.. పాఠశాలలకు పంపించింది. కిట్‌లో బ్యాగ్, బెల్ట్, నోట్‌బుక్స్ షూస్, యూనిఫాం, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, టెక్స్ట్ బుక్స్ వర్క్ బుక్స్ ఉంటాయి. జిల్లాలోని 984 ప్రభుత్వ పాఠశాలల్లో 49,583 మంది విద్యార్థినులు, 44,771 విద్యార్థులు కలిపి మొత్తం 94,354 కిట్లు అందించనున్నారు. ఇప్పటికే బ్యాగులు 71%, బెల్టులు, నోట్‌బుక్స్, టెక్స్ట్ బుక్స్, డిక్షనరీలు, వర్క్‌బుక్స్ వంద శాతం, షూలు 68%, యూనిఫామ్స్ 54% ఆయా పాఠశాలలు చేరాయి. మిగతా వాటిని కూడా రెండు మూడు రోజుల్లో పంపించనున్నారు. మొత్తంగా జిల్లాలో 94354 బ్యాగులు, 61548 బెల్టులు, 662952 నోటు పుస్తకాలు, 94548 షూలు, 84354 జతల యూనిఫామ్స్, 9228 డిక్షనరీలు, 414529 టెక్ట్సు పుస్తకాలు, 76662 వర్కు పుస్తకాలను విద్యార్థులకు అందజేయనున్నారు. అయితే బెల్టులు, షూలు, యూనిఫామ్, బ్యాగులను స్కూల్స్‌లో గత ఏడాది మాదిరి పేరెంట్స్ మీటింగులను వేడుకగా నిర్వహించి అందజేయాలని ఆలోచన చేస్తున్నారు. ఈ నెల 20న పేరెంట్స్ మీటింగ్ నిర్వహించే అవకాశం ఉందని చెబుతున్నారు.

మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం : కలెక్టర్ ప్రశాంతి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనానికి (ఎండీఎం) ఇకపై ఫోర్టిఫైడ్ సన్న బియ్యం వినియోగించనున్నారని, ఈ మేరకు ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు కూడా వాటినే పంపించామన్నారు. జిల్లాలోని మొత్తం 804 పాఠశాలలు, 70 సంక్షేమ వసతి గృహాలకు 25కిలోల బరువున్న 11,150 బస్తాలను ఇప్పటికే పంపించామన్నారు. ప్రతి బస్తాపైనా ఉన్న క్యూఆర్ కోడ్‌ని సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్కాన్ చేయాలన్నారు. కాగా నూతన విద్యాసంవత్సరంలో పాఠశాలలు ప్రారంభించిన రోజే డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకంలో సన్నబియ్యం (ఫైన్‌రైస్) వినియోగించడం జరుగుతుందని జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కే వాసుదేవరావు తెలిపారు.



ఆర్టీసీ అధికారుల బదిలీలు

రాజమహేంద్రవరంఅర్బన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పెద్దఎత్తున బదిలీలు జరిగాయి. డిపో మేనేజర్ కేడర్‌లో ఈ బదిలీలు చేపట్టారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న షేక్ షబ్నం ఏలూరు జిల్లా ఆర్టీసీ అధికారిణి (డీపీటీఓ)గా బదిలీ చేశారు. ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి డీపీటీఓగా ఆమె బాధ్యతలు చేపడతారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్‌గా ఇక్కడి కార్గో విభాగంలో ఏటీఎం (కమర్షియల్)గా పనిచేస్తున్న కె.మాధవ్‌ను నియమించారు. అలాగే కొవ్వూరు డిపోమేనేజర్‌గా ఉన్న వైవీవీఎస్ కుమార్‌ను రావులపాలెం డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. కొవ్వూరు డీఎంగా ఎవరినీ నియమించలేదు. రాజమహేంద్రవరం కార్గో మేనేజర్ మాధవ్ స్థానంలో తుని డిపో మేనేజర్ ఎన్.కిరణ్ కుమార్ బదిలీపై రానున్నారు. మంగళవారం రాత్రి ఆర్టీసీ ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు ఉత్తర్వులు అందాయి.






జిల్లాలో 1368 పనులకు శ్రీకారం : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో రూ.3430 కోట్ల 77 లక్షలతో చేపట్టిన 1368 పనులకు బుధవారం శంకుస్థాపనలు జరిగాయని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఆయా ప్రారంభోత్సవాల్లో జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఈ శంకుస్థాపనలు చేశారని తెలిపారు.









ఏడాది.. ఏమైంది..

కందుల దుర్గేష్, పర్యాటక శాఖ మంత్రి, నిడదవోలు ఎమ్మెల్యే



● ఎన్నికల హామీలు- ప్రస్తుత పరిస్థితి : నిడదవోలు ప్రభుత్వాస్పత్రిని 30 పడకల నుంచి 100 పడకలు చేయడానికి చర్యలు తీసుకున్నారు. జగన్ రివర్స్ టెండరింగ్‌లో ఆగిపోయిన మినీ స్టేడియం నిర్మాణానికి త్వరలోనే పనులు మొదలు కానున్నాయి.
● ప్రతిపాదనలు- నిధుల మంజూరు : నియోజకవర్గ అభివృద్ధికి రూ.227కోట్లు ఖర్చు చేశారు. మరో రూ.180కోట్ల పనులు జరుగతున్నాయి. సీఎంఆర్ఎఫ్ ఫండును 127 మందికి రూ.1.34కోట్లు అందజేశారు.
● ప్రజలకు చేరువయ్యేందుకు : మంత్రిగా బిజీగా ఉన్నా ప్రజలకు చేరువగా ఉంటారు. ఎవరు ఏ కార్యక్రమానికి పిలిచినా హాజరవుతారు. ప్రజల్లో ఎప్పుడూ ఉంటారు. నియోజకవర్గంలో ఎలాంటి ప్రమాదాలు జరిగినా అర్ధరాత్రి అయినా బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించి చేతనైన సాయం చేస్తున్నారు. ప్రభుత్వ పరిహారం అందేలా చూస్తున్నారు.

గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే



● ఎన్నికల హామీలు-ప్రస్తుత పరిస్థితి : ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు చేసిన విషయం తెలిసిందే. ఆ చట్టం అయిన తర్వాత రూరల్ మండలంలో వైసీపీ చేసిన అరాచకాలపై విచారణ చేయడానికి చర్యలు తీసుకున్నారు. 250 కొత్త పింఛన్లు మంజూరు చేయించారు. రూ.6 కోట్లతో రోడ్ల మరమ్మతులు పూర్తయ్యాయి. ఇంకా రూ.144 కోట్ల పనులు పూర్తి కావొస్తున్నాయి. రూ.20 కోట్లతో డ్రైన్లు, రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఎంపీ ల్యాడ్స్ ద్వారా రూ.50 లక్షల పనులు... పంట ముంపు నివారణకు రూ.3 కోట్లు ఖర్చుచేశారు.
● ప్రతిపాదనలు : రూ.130 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి ప్రతిపాదించారు. గోదావరి కాలుష్య నివారణ పథకం కింద రూ.550 కోట్లతో డీపీఆర్ తయారవుతోంది. సీఎంఆర్ఎఫ్‌లో రూ.1.30 కోట్లు 104 మందికి అందజేశారు. సీఎస్ఆర్‌లో పేపరుమిల్లు, గెయిల్ సహకారంతో రూ.3 కోట్లతో ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నారు. ఇరిగేషన్‌లో పొట్టిలంక తదితర ప్రాంతాల అభివృద్ధికి రూ.9 కోట్లు ప్రతిపాదనలు పంపారు. ఈస్ట్ రైల్వేస్టేషన్, గాదాలమ్మనగర్ తదితర రోడ్ల విస్తరణకు ప్రపోజల్స్ రెడీ అయ్యాయి.
● ప్రజలకు చేరువయ్యేందుకు : నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారు. ప్రతి రోజూ నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతూ ఉంటారు. నాయకులను, అధికశాతం ప్రజానీకాన్ని ఎన్నాళ్ల గడిచినా పేరుతో గుర్తుపట్టి పిలవడం ఆయన ప్రత్యేకత.

ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే




● ఎన్నికల హామీలు-ప్రస్తుత పరిస్థితి : ఆరోగ్యకరమైన రాజమహేం ద్రవరం ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. దీని అమ లుకు ప్రభుత్వాస్పత్రిని ప్రతి 15 రోజులకు తనిఖీ చేస్తున్నారు. సీఎస్ఆర్ ఫండ్స్ రూ.69 లక్షలతో ఆస్పత్రిలో పరికరాలను ఏర్పాటుచేశారు. పోస్టుమార్టం విభాగానికి కొత్త ఫ్రీజర్లు ఇప్పించారు. సీఎంఆర్ఎఫ్ కింద రూ.1.25కోట్లు బాధి తులకు అందజేశారు. నగరంలో 30 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్లను రూ.24.5 కోట్లతో నిర్మిస్తు న్నారు. డ్రైన్లను 26.5 కిలోమీటర్ల మేర రూ.5 కోట్లతో పునరుద్ధరిస్తున్నారు. 25 ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటుచేశారు. 30 పార్కులను ఆధునీకరించారు. థీమ్ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. రూ.20 కోట్లతో రివర్ ఫ్రంట్ వ్యూ నిర్మాణం ప్రారంభమైంది. ఈ ఏడాదిలో రూ. 250 కోట్లతో పనులు చేపట్టి 80 శాతం పూర్తి చేశారు. రూ.98 లక్షలతో వీధి దీపాలు ఏర్పాటు చేయించారు. అమరావతి సొల్యూషన్ కంపెనీలో రాజమండ్రి యువతకు 40 మందికి శిక్షణ ఇప్పించి 26 మందికి ఉద్యోగాలు ఇప్పించారు.
● ప్రతిపాదనలు- నిధుల మంజూరు: రూ.50 కోట్లతో ఖేల్ ఇండియా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించాలని ప్రతిపాదనలు పంపారు. మునిసిపల్ స్టేడియాన్ని రంజీ మ్యాచ్‌లు నిర్వహించే స్థాయిలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అమృత్ భారత్‌లో భాగంగా రూ.22 కోట్లు కేంద్రం కేటాయించింది. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ రావడానికి కృషిచేశారు.
● ప్రజలకు చేరువయ్యేందుకు : అధికారంలోకి రాగానే మహిళల కోరిక మేరకు 'మీ భద్రత-మా బాధ్యత' కింద సదస్సులు నిర్వహించి 53 మంది అసాంఘిక వ్యక్తులపై కేసులు నమోదు చేయించి, ఐదుగురిపై రౌడీషీట్లు తెరిపించారు.

బత్తుల బలరామకృష్ణ, రాజానగరం ఎమ్మెల్యే



● ఎన్నికల హామీలు-ప్రస్తుత పరిస్థితి : కవలచర్లలో ఏపీఐఐసీకి సంబంధించి 104 ఎకరాల్లో పరిశ్రమల స్థాపనకు పనులు మొదలయ్యాయి. రూ.70 కోట్లతో రహదారి పనులు పూర్తిచేశారు. 68 ఎకరాల్లో ఫారెస్ట్ అకాడమీ రూ.642 కోట్లతో ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. స్వరూప్ నగర్‌లో రూ.70 కోట్లతో విద్యుత్ పంపిణీ కేంద్రం నిర్మాణం పూర్తయింది. కోరుకొండ గుడికి రూ.36 కోట్లతో రోప్‌వే ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించాల్సి ఉంది. శ్రీరాంపురం రోడ్డును రెండులేన్లుగా విస్తరించనున్నారు.
● ప్రతిపాదనలు-నిధులు మంజూరు : చాగల్నాడు కాలువ పూడికతీత పనులకు, పంపింగ్ హౌస్‌కి షట్టర్ల రిపేరుకు రూ.1 కోటి నిధులు మంజూరు చేయించారు. సీఎంఆర్ఎఫ్ సుమారు రూ.5 కోట్లు బాధితులకు అందజేశారు.
● ప్రజలకు చేరువయ్యేందుకు : జనవాణి కార్యక్రమంతో షెడ్యూల్ ప్రకారం ఒక మండలంలో ప్రజలతో సమావేశం ఏర్పాటుచేసి అధికారులతో అక్కడికక్కడే పరిష్కారం చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

నల్లమిల్లి రామకృష్ణారెడ్డి , అనపర్తి ఎమ్మెల్యే



● ఎన్నికల హామీలు-ప్రస్తుత పరిస్థితి: వేమగిరి-కాకినాడ కెనాల్ రోడ్డుకు రూ.8 కోట్లతో మరమ్మతులు చేయించారు. సామర్లకోట, కాకినాడ ప్రధాన పంట కాలువల్లో గత ఐదేళ్లగా పూడుకుపోయిన గుర్రపుడెక్కను ఉపాధి హామీ కూలీలతో తొలగించారు. రంగంపేట మండలంలోని అధ్వానంగా ఉన్న ప్రధాన రోడ్లను రూ.6.50 కోట్లతో అభివృద్ధి చేశారు. అనపర్తి మండలంలో రామవరం-రాయవరం రహదారి రూ.1.50కోట్లతో బాగుచేశారు. రెండు ఫేజుల్లో నాలుగు మండలాల్లో సుమారు రూ.30కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్లు పనులు జరుగుతున్నాయి. సగా నికి పైగా ప్రారంభమయ్యాయి. మొత్తంగా నియోజకవర్గంలో అన్ని పనులూ కలిపి రూ.95 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. అనపర్తి ఏరియా ఆస్పత్రిలో రూ.12 కోట్లతో నూతన భవన నిర్మాణాలు జరుగుతున్నాయి.
● ప్రతిపాదనలు-నిధులు మంజూరు : కెనాల్ రోడ్ పీపీపీ విధానంలో నిర్మించడానికి సర్వే జరుగుతోంది. ఈ రోడ్డు బాగా పాడైనచోట కొత్తగా రోడ్డు నిర్మించారు. అనపర్తి-బిక్కవోలు రోడ్డుకు రూ.5.30 కోట్లతో ప్రతిపాదనలు పంపగా రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. 8 దేవాలయాల అభివృద్ధికి రూ.12 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు.
● ప్రజలకు చేరువయ్యేందుకు : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారు. రోజుకు కనీసం మూడు మండలాల్లో పర్యటిస్తారు.

ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఎమ్మెల్యే



● ఎన్నికల హామీలు-ప్రస్తుత పరిస్థితి : ఎక్స్‌ప్రెస్ ట్రైన్లు, బస్సులు కొవ్వూరులో నిలుపుదలకు చర్యలు తీసుకున్నారు. కొవ్వూరు ప్రభుత్వాస్పత్రి రినోవేషన్‌కి రూ.1 కోటితో ప్రారంభోత్సవం చేశారు. సోషల్, బీసీ వెల్ఫేర్ వసతి గృహాల పునఃనిర్మాణానికి రూ.3.65 కోట్లతో ప్రతిపాదనలను పంపారు. రెండు ఎస్టీ హాస్టళ్లరు రూ.3.92 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. నియోజకవర్గంలో 32 కిలోమీటర్ల సీసీ రోడ్లను రూ.6.72 కోట్లతో పూర్తిచేశారు. డ్రైన్లు రూ.1.31కోట్లతో 6 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేశారు. నేషనల్ మిషన్ కింద మార్కొండపాడు, మలకపల్లిలో బ్లాక్ హెల్త్ సెంటర్ ల్యాబ్స్‌ని రూ.1కోటితో పూర్తిచేశారు. రూ.72 లక్షలతో 13 బోర్లు, రూ.3.66 కోట్లతో 12 కిలోమీటర్లతో రోడ్లు వేశారు. రూ.6.56కోట్లతో 7 ఆర్అండ్‌బీ రోడ్లకు మరమ్మతులు చేశారు. 226 మందికి సీఎంఆర్ఎఫ్ రూ.2.34కోట్లు ఇచ్చారు.
● ప్రతిపాదనలు-నిధులు మంజూరు: కొవ్వూరు పట్టణంలో రూ.69.70 కోట్లతో గోదావరి ఉపరితల జలాలను తాగునీరుగా అందించడానికి డీపీఆర్‌ని ప్రభుత్వానికి సమర్పించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద ఎస్సీ ప్రాంతాల్లో 58సీసీ రోడ్లకు రూ.3.81కోట్లతోను, రూరల్ వాటర్ వర్క్స్ పథకంలో 100 పనులకు రూ.24.20కోట్లకు ప్రతిపాదనలు పంపారు.
● ప్రజలకు చేరువయ్యేందుకు: నియోజకవర్గ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. వారంలో ఒక రోజు ఎమ్మెల్యే గ్రీవెన్స్ నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తున్నారు.

మద్దిపాటి వెంకట్రాజు, గోపాలపురం ఎమ్మెల్యే



● ఎన్నికల హామీలు-ప్రస్తుత పరిస్థితి : గోపాలపురంలోని ముంపు సమస్య పరిష్కారానికి నిధులు తీసుకొ చ్చారు. ఎర్రకాలువ, తాడిపూడి, కొవ్వాడ కాలువలకు వచ్చే వరద లకు ప్రతి ఏటా 6 వేల ఎకరాలు మునిగిపోతోంది. ఈ పనులకు రూ.2కోట్లు నిధులు మంజూరుచేయించి పనులుచేయిస్తున్నారు. బాధితులకు సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.3కోట్లు అందజేశారు.
● ప్రతిపాదనలు-నిధులు మంజూరు : నియోజకవర్గంలో రూ.50 కోట్లతో 570 రోడ్ల పనులను పూర్తిచేశారు. వీటిలో మరమ్మతులు చేసినవాటితోపాటు కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు ఉన్నాయి. గోపాలపురం మండలంలో 57 పనులకు 4.94కోట్లు, దేవరపల్లి 150 పనులు రూ.9.68కోట్లు, నల్లజర్ల 164 పనులకు రూ.19.86కోట్లు, ద్వారకాతిరుమల 166 పనులకు రూ.13.98కోట్లు వెచ్చించారు. 4 మండలాల్లో ఒక్కో ప్రభుత్వాస్పత్రికి 4 ఏసీలు సమకూర్చారు.
● ప్రజలకు చేరువయ్యేందుకు: 'గ్రామదర్శిని' పేరుతో కార్యక్రమాన్ని మొదలుపెట్టి నియోజకవర్గంలోని 85 పంచాయతీల్లోని ప్రతి ఇంటికి వెళ్లి బాగోగులు తెలుసుకున్నారు. గ్రామాల్లో సమస్యలను అంచనా వేసి ఆ మేరకు చర్యలకు ఉపక్రమించారు. తన గౌరవ వేతనంతో ఆరుగొలను గురుకుల పాఠశాలకు ఆర్వో ప్లాంటును కొనిచ్చారు.

రోడ్లను అభివృద్ధి చేస్తాం : మంత్రి

పెరవలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రోడ్లన్నీ అద్దంలా మెరుస్తున్నాయని, వాటన్నింటినీ అభివృద్ధి పరుస్తామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఖండవల్లిలో రూ. 68.50 లక్షల ఎన్‌జీఎస్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించినపంచాయతీ రోడ్లను బుధవారం ప్రారంభించారు. అనంతరం మరో కొత్త రోడ్డుకు శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఈ గ్రామ రహదారులు అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. తర్వాత కానూరులో రూ. 9.83 లక్షల వ్యయంతో నిర్మించిన ఆరుపడకల యూనిట్ ఆసుపత్రి భవనాన్ని ప్రారంభించారు. ఏపీ ఎస్ఎస్‌డీసీ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, భూపతిరాజు రవివర్మ, అతికాల వెంకట రామకృష్ణమ్మ, పిప్పర రవి, కార్చెర్ల ప్రసాద్, సర్పంచ్ పులిదిండి నాగరాజు, కానూరు సర్పంచ్ భావనమధు, తదితరులు పాల్గొన్నారు.



ఖండవల్లిలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, తదితరులు

100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్‌కి కృషి

నిడదవోలు: నిడదవోలు పట్టణంలో ఉన్న 30 పడకల ఆసుపత్రిని రాబోయే రోజుల్లో 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తామని, ఇప్పటికే ఆ దిశగా కృషి చేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం సమిశ్రగూడెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనంగా ఆరు పడకల యూనిట్ భవనాన్ని జిల్లా కలెకర్ పి.ప్రశాంతితో కలిసి ప్రారం భించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే కోరుమామిడిలో రూరల్ వాటర్ సప్లయ్ పనులు, పట్టణంలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద సబ్‌స్టేషన్, అన్నక్యాంటీన్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు.

ఉండ్రాజవరం: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభు త్వం పనిచేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఎన్‌హెచ్ఎం (నేషనల్ మిషన్‌లలోని 15వ ఆర్థిక సంఘం నిధులు) రూ. 50 లక్షలతో నిర్మించిన ల్యాబొరేటరీ భవనాన్ని మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు .మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, టౌన్ సర్పంచ్ ఎం.వెంకటరావు, ఎంపీటీసీ సభ్యులు వరలక్ష్మి, డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్, ఎంపీడీవో రామారావు, తహశీల్దార్ ప్రసాద్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంపిటీటివ్ మెటీరియల్ అందజేత

దేవరపల్లి, జూన్11 (ఆంధ్రజ్యోతి): కాంపిటీటివ్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గద్దే శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఐఐటీ, ఏఐఈ, ఏపీ ఎంసెట్, నీట్, పలు పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ ఛత్రపతి శివాజీ పాల్గొన్నారు.

అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట : ఎమ్మెల్యే



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్డీవో, తదితరులు

తాళ్లపూడి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. పైడిమెట్టలో రూ.20 లక్షలతో పూర్తిచేసిన సీసీ రోడ్డును బుధవారం ఆర్డీవో రాణీసుస్మితతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మోహన భారతి, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, ఎన్డీయే నాయకులు మాజీ ఎంపీపీ కొప్పాక కోటీన్స్, కొప్పాక విజయానంద జవహర్, నాయుడు హనుమంతరావు, ఇందుగుల రామకృష్ణ, గంటా కృష్ణ, విత్తం నాని, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో శ్రీవారి గరుడ వాహనసేవ

దేవరపల్లి, జూన్11 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జ్యేష్ఠపౌర్ణమి సందర్భంగా స్వామి వారికి బుధవారం సాయంత్రం గరుడ వాహన సేవను ఘనంగా నిర్వహించారు. మాడ వీధుల్లో వాయిద్యకారులతో స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సన్మానం

పెరవలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆ ఫౌండేషన్ అన్నవరప్పాడు శాఖ ఆధ్వర్యంలో రైతులను బుధవారం సన్మానించారు. ముక్కామల, ముత్యాలవారి పాలెం, ఉమ్మిడి వారిపాలెం, ఓదురివారిపాలెం గ్రామ రైతులైన చిట్టిడి మూర్తి, రేలంగి రాజేష్, బొలిశెట్టి సూర్యప్రకాష్, పంతం కృపాకరరావు, పొప్పుప్పు శివను ఫౌండేషన్ సభ్యులైన పొప్పొప్పు వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సన్మానించారు. రైతులు చిట్టిడి సూర్యనారాయణ, సరుకుల తమ్మారావు, రేలంగి చిన్న వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జగన్నాథపురంలో 'ఏరువాక'



ఎడ్లబండి తోలుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని ప్రజలంతా సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. జగన్నాథపురంలో నియోజకవర్గ స్థాయి ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎడ్లబండిపై సవారీ చేస్తూ కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేశారు. నాగలితో పొలందున్నారు. అనంతరం రైతులకు 80 శాతం రాయితీపై కిసాన్ డ్రోన్‌లు, నవధాన్యాలు పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయాధికారులు, నాలుగుమండలాల ఏవోలు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి, మండల అధ్యక్ష, కార్యదర్శులు రొంగల సత్యనారాయణ, రమేష్, జగన్నా థపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు పసుమర్తి గంగాధర్, తెలుగు యువత అధ్యక్షుడు కాట్ర గడ్డ సురేశ్, పసుమర్తి పెద్దబ్బులు, వేముల నాగరాజు, ఉపాధ్యక్షులు దొరబాబు, మద్దిపాటి రమేశ్, హోతా రాజాబాబు, నందమూరి సత్య నారాయణ, ముత్యాల రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఐషర్ వ్యాన్‌ను ఢీకొట్టిన ఊక లారీ..కేసు నమోదు

కొవ్వూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌ప్లాజా సమీపంలో ఐషర్ వ్యాన్‌ను ఊక లారీ బుధవారం ఢీకొట్టింది. ఇందులో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు. షేక్ రబ్బానీ అనే డ్రైవర్ హైదరాబాద్ నుంచి ఫెర్టిలైజర్ లోడ్‌తో విశాఖపట్నం బయలుదేరాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున గామన్‌బ్రిడ్జి టోల్‌ప్లాజా వద్దకు చేరుకునే సరికి వెనుకనుంచి వచ్చిన ఊక లారీ ఓవర్ టెక్ చేస్తూ ఐషర్ వ్యాన్‌ను ఢీకొట్టింది. దీంతో ఐషర్ వ్యాన్ డ్రైవర్ రబ్బానీ పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

బాలాత్రిపుర సుందరికి పౌర్ణమి పూజలు



పుష్పాల అలంకరణలో అమ్మవారు

కొవ్వూరు, జూన్11 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న బాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో జ్యేష్ఠపౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో అమ్మవారిని తొమ్మిదిరకాల పుష్పాలతో విశేష అలంకరణ చేశారు. అనంతరం తొమ్మిది రకాల పండ్లతో నివేదన చేశారు. మహిళలు సామూహిక కుంకుమపూజలు గావించారు. పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

సుధాకర్ కుటుంబానికి న్యాయం చేస్తా : జవహర్



కొవ్వూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సుధాకర్ కుటుంబానికి తగిన న్యాయం చేస్తానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్, మాజీమంత్రి కేఎస్ జవహర్ భరోసా ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో వేధింపులు, చిత్రహింసలకు గురికాబడ్డ సుధాకర్... అనంతరం మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం విశాఖపట్నంలో ఆయన కుటుంబ సభ్యుల్ని కలిసి పరామర్శించారు.

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చైర్మన్ జవహర్

పల్లా శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే ముప్పిడి పరామర్శ

కొవ్వూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును బుధవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఆయన తండ్రి పల్లా సింహాచలం ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, సూరపనేని చిన్ని, మద్దిపట్ల సురేష్, కురాకుల బుజ్జి విశాఖపట్నం వెళ్లారు. ఈ సందర్భంగా సింహాచలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



సింహాచలం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

ఖరీఫ్‌కు 'పైడిమెట్ట' సాగునీరు విడుదల



ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఏరువాక పౌర్ణమి సందర్భంగా పైడిమెట్ట ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సాగునీటిని విడుదలచేశారు. దీనికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై పంప్‌హౌస్ వద్ద స్విచ్చాన్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులో ఉన్న ప్పటికీ రైతాంగం కోసం విశేషంగా పనిచేస్తోందన్నారు. రైతు సంఘం అధ్యక్షుడు ముళ్లపూడి శ్రీరామచంద్ర మూర్తి, ఏపీఎస్ఐడీసీ డీఈ గురవయ్య, ఏఈ సుదీర్, తహశీల్దార్ మోహనభారతి, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'పార్డ్ ఇండియా సేవలు అనిర్వచనీయం'

నల్లజర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పార్డ్ ఇండియా సేవలు అనిర్వచనీయమని సీఐ రాంబాబు, ఎంపీడీవో సింహాద్రిరావు అన్నారు. బుధవారం స్థానిక పార్డు ఇండియా కార్యాలయంలో కుట్టుమిషన్ శిక్షణ పొందిన 30 మందిమహిళలకు సర్టిఫికెట్లను అందించారు. పార్డు ఇండియా గౌరవాధ్యక్షుడు కారుమంచి గణేశ్, జాతీయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, మండలాధ్యక్షుడు ఎండీ ఇలియాజ్, చీమకుర్తి కృష్ణప్రసాద్, కోశాధికారి జీవీవీ ప్రసాద్, పెనుగొండ కృష్ణవేణి పాల్గొన్నారు.